RNI: APTEL/2013/54506

# నేటి ప్రస్థానం

తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | గురువారం 13-8-2026 | సంచిక: 13 | సంఖ్య: 315 పేజీలు: 8 | వెల: 5/- | ఎడిటర్: సందీప్ గౌడ్ వి

# ధరల మంట.. పెరిగిన ఇన్‌ఫ్లేషన్



### ఆహార ధరల పెరుగుదలతో జులైలో 4.45 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం..

### 5.52 శాతానికి చేరిన ఫుడ్ ఇన్‌ఫ్లేషన్..

### అల్లం, వెల్లుల్లి, ఉల్లి ధరలకు రెక్కలు

దేశంలో ఆహార పదార్థాల ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా వంటింట్లో నిత్యం వినియోగించే కొన్ని కూరగాయలు, మసాలా దినుసుల ధరలు పెరగడంతో రిటైల్ ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్) జులైలో స్వల్పంగా ఎగిసింది. జూన్‌లో 4.38 శాతంగా ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జులైలో 4.45 శాతానికి చేరింది. ఇదే సమయంలో ఆహార ద్రవ్యోల్బణం కూడా పెరిగింది. జూన్‌లో 5.32 శాతంగా ఉన్న కన్జ్యూమర్ ఫుడ్ ప్రైస్ ఇండెక్స్ జులైలో 5.52 శాతానికి చేరింది. దీంతో రాబోయే రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలపై మరింత ఒత్తిడి ఉంటుందా అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

2లో



## జగన్‌కు ధైర్యముంటే అసెంబ్లీకి రావాలి..

### ఆధారాలతో చర్చకు మేం సిద్ధం: హోంమంత్రి అనిత

- మెగా డీఎస్సీపై వైసీపీ ఆరోపణలను తిప్పికొట్టిన అనిత
- రోడ్డు మీద నిలబడి ఆరోపణలు చేయడం కాదంటూ జగన్ కు కౌంటర్
- సభకు వచ్చి ఆధారాలు చూపాలని సవాల్



## ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు చెక్

### ఉప్పాడ తీరానికి రక్షణ కవచం..

### పవన్ సమక్షంలో మద్రాస్ ఐఐటీతో ఒప్పందం

- పవన్ కల్యాణ్ చొరవతో రంగంలోకి మద్రాస్ ఐఐటీ
- రూ.323 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు నిర్మాణం
- డిజైన్, డీపీఆర్, పర్యవేక్షణ బాధ్యతలు చూడనున్న ఐఐటీ-మద్రాస్

## గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం
- ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల నుంచి నీటిని లిఫ్ట్ చేయాలని సీఎం ఆదేశం
- కాళేశ్వరం బ్యారేజీల భద్రతపై ఎన్డీఎస్ఏ సూచనలను కచ్చితంగా పాటించాలని స్పష్టం
- భూ నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించేందుకు కార్యాచరణకు ఆదేశం

2లో



గోదావరి నదీ జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఎల్లంపల్లి, దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటి ఎత్తిపోతల (లిఫ్ట్) ప్రక్రియను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన నీటిపారుదల శాఖపై



## తెలంగాణలో రేపే 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం

## రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర విమర్శలు

## సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడిపై కేటీఆర్ విమర్శల దాడి

- మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు
- మేం టీ-హబ్ కడితే.. రేవంత్ 'అనుముల హబ్స్' తెస్తున్నారని ఎద్దేవా
- సీఎం సోదరుడి సంస్థకు రూ. 200 కోట్ల విలువైన భూమి కట్టబెట్టారని ఆరోపణ
- లక్ష మూలధనం ఉన్న కంపెనీకి భూ కేటాయింపులపై సమగ్ర విచారణకు డిమాండ్
- ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, కోర్టును ఆశ్రయిస్తామని వెల్లడి


2లో



## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన

- జీవితంలో షార్ట్‌కట్‌లు ప్రమాదకరమన్న ప్రధాని నరేంద్ర మోదీ
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్‌తో జాగ్రత్తగా ఉండాలని సూచన
- గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలంటూ యువతకు హితవు
- మాజీ రాష్ట్రపతి కోవింద్ ఆత్మకథ ఆవిష్కరణ సభలో వ్యాఖ్యలు

2లో



## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

### తనను లుంగీవాలా అని పిలిచారంటూ బీజేపీ ఎంపీపై సీపీఎం ఎంపీ ఫిర్యాదు

- ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, బ్రిట్టాస్ అబద్ధం చెబుతున్నారని సుస్మితా దేవ్ ఖండన
- ఒకరిపై మరొకరు హక్కుల ఉల్లంఘన

రాజ్యసభలో బుధవారం 'లుంగీవాలా' వివాదం తీవ్ర దుమారం రేపింది. తనను ఉద్దేశించి బీజేపీ ఎంపీ సుస్మితా దేవ్ ఈ పదాన్ని

# ధరల మంట.. పెరిగిన ఇన్‌ఫ్లేషన్

**వంటింటిపై పెరుగుతున్న భారం**


ఆహార ధరల పెరుగుదల ప్రభావం నేరుగా సామాన్యుల కుటుంబ బడ్జెట్‌పై పడుతోంది. ముఖ్యంగా వంటల్లో తరచుగా ఉపయోగించే అల్లం, వెల్లుల్లి, ఉల్లి వంటి పదార్థాల ధరలు ఏడాది వ్యవధిలో గణనీయంగా పెరిగాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే అల్లం ధరలు ఏకంగా 83.62 శాతం, వెల్లుల్లి ధరలు 35.36 శాతం, ఉల్లి ధరలు 22.54 శాతం పెరిగాయి. దీంతో మార్కెట్‌కు వెళ్లే వినియోగదారులు ధరలను చూసి ఆందోళన చెందుతున్నారు. ఒకవైపు కూరగాయలు, మరోవైపు ఇతర నిత్యావసరాల ధరలు పెరుగుతుండటంతో నెలవారీ ఖర్చులను నిర్వహించడం కష్టంగా మారుతోందని వినియోగదారులు చెబుతున్నారు.

**వరుసగా రెండో నెల 4 శాతానికి పైనే..**

రిటైల్ ద్రవ్యోల్బణం జులైలో 4.45 శాతానికి చేరడంతో ఇది వరుసగా రెండో నెల =దీ× నిర్దేశించిన 4 శాతం మధ్యకాలిక లక్ష్యానికి పైనే కొనసాగింది. అయితే ప్రస్తుతం ద్రవ్యోల్బణం 2 నుంచి 6 శాతం మధ్య ఉన్న అనుమతించదగిన పరిధిలోనే ఉంది. దీంతో ప్రస్తుత స్థాయిలో ధరల పెరుగుదల ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, ద్రవ్యోల్బణం నిర్దేశిత గరిష్ఠ పరిమితిని దాటలేదని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి.

**అన్ని వస్తువుల ధరలు పెరగలేదు**

అయితే ఆహార విభాగంలోని అన్ని వస్తువుల ధరలు పెరగడం లేదు. కొన్ని కూరగాయలు, ఇతర ఆహార పదార్థాల ధరల్లో తగ్గుదల కూడా నమోదైంది. ముఖ్యంగా కొన్ని కూరగాయల సరఫరా మెరుగుపడటం, పంటల లభ్యత పెరగడం వంటి కారణాలతో వాటి ధరలు తగ్గిన సందర్భాలు ఉన్నాయి. దీంతో మొత్తం ఆహార ద్రవ్యోల్బణంపై వివిధ వస్తువుల ధరల మార్పులు భిన్నమైన ప్రభావాన్ని చూపుతున్నాయి.




**ధరలపై వాతావరణ ప్రభావం**

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు సాధారణంగా వాతావరణ పరిస్థితులు, పంటల దిగుబడి, మార్కెట్‌కు వచ్చే సరఫరా, రవాణా ఖర్చులు తదితర అంశాలపై ఆధారపడి ఉంటాయి. భారీ వర్షాలు, వరదలు లేదా తక్కువ వర్షపాతం వంటి పరిస్థితులు పంటల సరఫరాను ప్రభావితం చేస్తే కొన్ని కూరగాయలు, మసాలా దినుసుల ధరలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంటుంది. మరోవైపు మంచి దిగుబడి, మార్కెట్లకు సరఫరా పెరగడం వల్ల కొన్ని వస్తువుల ధరలు తగ్గవచ్చు.

**రానున్న రోజుల్లో ఎలా ఉంటుంది?**

ఆహార పదార్థాల ధరల పరిణామం రానున్న నెలల్లో రిటైల్ ద్రవ్యోల్బణానికి కీలకంగా మారనుంది. ముఖ్యంగా కూరగాయలు, మసాలా దినుసులు, పప్పులు వంటి ఆహార పదార్థాల సరఫరా పరిస్థితిని మార్కెట్లు నిశితంగా గమనిస్తున్నాయి. నిపుణుల అంచనాల ప్రకారం రాబోయే కాలంలో ద్రవ్యోల్బణం కొంత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం అది =దీ×కి నిర్దేశించిన గరిష్ఠ పరిమితి కంటే దిగువనే ఉంది.

**సామాన్యుడికి ఏంటి ప్రభావం?**

రిటైల్ ద్రవ్యోల్బణం పెరగడం అంటే వినియోగదారులు కొనుగోలు చేసే వస్తువులు, సేవల మొత్తం ధరల్లో పెరుగుదల నమోదవుతున్నట్లు అర్థం. ఆహార ద్రవ్యోల్బణం పెరిగినప్పుడు దాని ప్రభావం నేరుగా కుటుంబాల రోజువారీ ఖర్చులపై కనిపిస్తుంది. ముఖ్యంగా మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాల కుటుంబాలకు ఆహార వస్తువుల ధరల పెరుగుదల నెలవారీ బడ్జెట్‌పై అదనపు భారాన్ని మోపుతుంది. ప్రస్తుతం అల్లం, వెల్లుల్లి, ఉల్లి వంటి వస్తువుల ధరలు భారీగా పెరగడం వంటింటి ఖర్చులపై ఒత్తిడిని పెంచుతోంది. అయితే ద్రవ్యోల్బణాన్ని అంచనా వేయడానికి ఒక్కటి రెండు వస్తువుల ధరలను మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా అనేక రకాల వస్తువులు, సేవల ధరల్లో వచ్చిన మార్పులను పరిగణనలోకి తీసుకుంటారు. మొత్తంగా చూస్తే.. జులైలో రిటైల్ ఇన్‌ఫ్లేషన్ 4.45 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతానికి చేరడం దేశంలో ధరల ఒత్తిడి మళ్లీ పెరుగుతున్న సంకేతాలను చూపిస్తోంది. ముఖ్యంగా అల్లం, వెల్లుల్లి, ఉల్లి ధరల భారీ పెరుగుదల సామాన్యుడి వంటింటిపై ప్రభావం చూపుతోంది. రాబోయే నెలల్లో ఆహార పదార్థాల సరఫరా, పంటల దిగుబడి, వాతావరణ పరిస్థితులు ధరల దిశను నిర్ణయించనున్నాయి.

## గోదావరి జలాల వినియోగంపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫార్సుల మేరకు ప్రస్తుతం సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలలో నీటిని నిల్వ చేయడం లేదని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలలో కొన్ని లోపాలను గుర్తించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించగా, ఈ అంశంపై తక్షణమే ఎన్డీఎస్ఏను సంప్రదించాలని సీఎం సూచించారు. దేవాదుల ప్రాజెక్టులో తొమ్మిది పంపుల ద్వారా నీటిని లిఫ్ట్ చేయడం కీలకమని, అక్కడ ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారంపై కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. నష్టపరిహారాన్ని తక్షణమే చెల్లించేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ముంపునకు గురయ్యే గ్రామాలు, పెండింగ్ పరిహారం, పునరావాస ప్యాకేజీలపై క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికలు అందజేయాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులను ఆదేశించారు. బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లిస్తేనే బస్వాపూర్, గౌరవెల్లి ప్రాజెక్టులను నింపడానికి వీలవుతుందని ఆయన పేర్కొన్నారు. గట్టు, గుడెందొడ్డి ఎత్తిపోతల పథకాల సామర్థ్యం పెంపుపై తగిన అధ్యయనం చేయాలని, గుడెందొడ్డి పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు కన్సల్టెంట్‌ను నియమించాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజ్యసభను కుదిపేసిన "లుంగీవాలా" వివాదం

ఉపయోగించారని కేరళకు చెందిన సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించడంతో సభలో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. సోమవారం నాడు సభలో తాను ఆదాయపు పన్ను సవరణ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెడుతున్న సమయంలో, పంచె కట్టుకుని ఉన్న తనను చూసి వెనుక సీటులో కూర్చున్న సుస్మితా దేవ్ పదేపదే 'లుంగీవాలా' అని సంబోధించారని బ్రిట్టాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇది దక్షిణాది సంస్కృతిని, మలయాళీలను అవమానించడమేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్వించదగ్గ భారతీయుడినని, దక్షిణాది వాడినని పేర్కొంటూ, ఈ వ్యాఖ్యలపై సుస్మితా దేవ్‌పై హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఆరోపణలను సుస్మితా దేవ్ తీవ్రంగా ఖండించారు. తాను అసోంకు చెందిన బెంగాలీనని, వివిధ రాష్ట్రాల వస్త్రధారణ పట్ల తనకు అపారమైన గౌరవం ఉందని స్పష్టం చేశారు. బ్రిట్టాస్ అసత్యాలు చెబుతున్నారని, ఏ విచారణలోనైనా వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆమె పేర్కొన్నారు. అంతేకాకుండా, మతపరమైన గుర్తింపులపై బ్రిట్టాస్ అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై ఆమె కూడా ప్రివిలేజ్ నోటీసు దాఖలు చేశారు. ఈ వివాదంపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. కొందరు ఎంపీలు పార్లమెంట్ వెలుపల పంచెకట్టుతో నిరసన తెలిపారు. సభా నాయకుడు జె.పి. నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడాలని సభ్యులను కోరారు. సభ్యులు ఒకరి సాంస్కృతిక సంప్రదాయాలను కించపరిచేలా వ్యాఖ్యలు చేయవద్దని సూచించిన చైర్మన్, ఇరుపక్షాలను తన ఛాంబర్‌కు పిలిచి సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. ప్రస్తుతం ఇరుపక్షాలు అందజేసిన హక్కుల ఉల్లంఘన నోటీసులు చైర్మన్ పరిశీలనలో ఉన్నాయి.

## మేం 'టీ-హబ్' కడితే.. రేవంత్ 'అనుముల హబ్' కడుతున్నారు


(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన సోదరుడు అనుముల కొండల్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన విమర్శల దాడిని మరింత ఉద్ధృతం చేశారు. సీఎం సోదరుడికి సంబంధముందని ఆరోపిస్తున్న టెస్సారక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు భూ కేటాయింపుల విషయంలో రూ. 200 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి 'అనుముల హబ్స్' ఏర్పాటులో బిజీగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బుధవారం ఈ అంశంపై 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా కేటీఆర్ స్పందించారు. "తాము నిజమైన స్టార్టప్‌ల అభివృద్ధి కోసం టీ-హబ్ నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం కుటుంబ సభ్యులతో నడిచే, సున్నా ఆవిష్కరణలు, సున్నా ఉద్యోగులతో కూడిన స్కామ్.. అదేనండీ స్కీమ్ అయిన 'అనుముల హబ్స్' సృష్టిస్తున్నారు. అనుముల సోదరుల్లో ఒకరైతే చాలు, ఎలాంటి ప్రశ్నలు లేకుండా చౌక ధరకే ప్రభుత్వ భూమిని కేటాయిస్తారు. సున్నా పెట్టుబడితో రాత్రికి రాత్రే రూ. 200 కోట్లు సంపాదించినందుకు అనుముల కొండల్ రెడ్డిని 'శతాబ్దపు ఆవిష్కర్త'గా ప్రకటించాలి" అని కేటీఆర్ తన పోస్టులో పేర్కొన్నారు. కేవలం రూ. లక్ష చెల్లింపు మూలధనం, సున్నా ఉద్యోగులు ఉన్న కంపెనీకి అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. సుమారు రూ. 200 కోట్ల విలువైన ఐదు ఎకరాల భూమిని కేవలం రూ. 7 కోట్లకే, అంటే గజం రూ. 3,700 చొప్పున కట్టబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ భూముల నుంచి కోట్లాది రూపాయలు సంపాదించే ఈ మ్యాజిక్ ట్రిక్‌ను కేవలం అనుముల కుటుంబానికే పరిమితం చేయకుండా తెలంగాణ యువతకు కూడా నేర్పించాలని మంత్రి శ్రీధర్ బాబు, సీఎం రేవంత్ రెడ్డిలను ఉద్దేశించి అన్నారు. టెస్సారక్ట్ సంస్థతో సీఎం సోదరుడికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. కొండల్ రెడ్డి లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో, యూఎస్-ఇండియా స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్‌లో ఆయన్ను టెస్సారక్ట్ చైర్మన్‌గా గుర్తించిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఈ భూ కేటాయింపులకు సంబంధించిన జీవో, భూమి విలువ, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు వంటి అన్ని పత్రాలను ప్రభుత్వం వెంటనే బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ భూ కేటాయింపుల వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని, దీనిపై ముందుగా గవర్నర్‌కు ఫిర్యాదు చేసి, అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. వాస్తవాలు వెలుగులోకి వచ్చి, బాధ్యులను శిక్షించే వరకు ఈ అంశాన్ని వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు.

## రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్ర విమర్శలు

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ఎంపీ నిశికాంత్ దూబే తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాకిస్థాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా, రాహుల్ గాంధీ రూపంలో పునర్జన్మించారని, జిన్నా కంటే కూడా రాహుల్ అత్యంత ప్రమాదకరమైన నాయకుడని బుధవారం ఆయన విమర్శించారు. ఈ మేరకు తన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఝార్ఖండ్‌లో ఉద్యోగ నియామక పరీక్షల్లో అవకతవకలపై విద్యార్థులు చేపట్టిన నిరసనల నేపథ్యంలో దూబే ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కుంభకోణంపై సీబీఐ విచారణను కాంగ్రెస్ పార్టీ ఎందుకు వ్యతిరేకిస్తోందని ఆయన నిలదీశారు. ప్రధాన నిందితుడు ఝార్ఖండ్ ప్రభుత్వంలోని ఒక సీనియర్ అధికారి నివాసంలో పట్టుబడ్డాడని, ఒకవేళ సీబీఐ విచారణ నిష్పక్షపాతంగా జరిగితే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు కూడా చిక్కులు తప్పవని ఆరోపించారు. విద్యార్థులకు నిజంగా సంఘీభావం తెలపాలనుకుంటే ఝార్ఖండ్ ప్రభుత్వానికి కాంగ్రెస్ తన మద్దతును వెంటనే ఉపసంహరించుకోవాలని దూబే సవాల్ విసిరారు. లేనిపక్షంలో ఆ పార్టీ జార్జ్ సోరోస్ అజెండాతో పనిచేస్తున్నట్లు భావించాల్సి ఉంటుందని అన్నారు. ప్రధానికి వ్యతిరేకంగా ఎక్కడ నిరసనలు జరిగినా రాహుల్ గాంధీ అక్కడ ప్రత్యక్షమవుతున్నారని ఆయన మండిపడ్డారు. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్సీ) పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ విద్యార్థులు 19 రోజులుగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, వివాదాస్పద పరీక్షల రద్దు, స్వతంత్ర విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల అసెంబ్లీ ముట్టడికి యత్నించిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్, వాటర్ కేనన్లు, బాష్పవాయువు ప్రయోగించడంతో బీజేపీ రాష్ట్రవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరపాలని

## జెన్-జీకి ప్రధాని నరేంద్రమోదీ కీలక సూచన



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేటి తరం యువతకు (జెన్-జీ) పలు కీలక సూచనలు చేశారు. జీవితంలో అడ్డదారుల వెంట పడొద్దని, అవి అంతిమంగా తీవ్ర నష్టాలకే దారితీస్తాయని ఆయన హెచ్చరించారు. అదే సమయంలో, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, రీల్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బుధవారం నాడు ఢిల్లీలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆత్మకథ 'ట్రయంఫ్ ఆఫ్ ది ఇండియన్ రిపబ్లిక్: మై లైఫ్, మై స్ట్రగుల్స్' ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైల్వే స్టేషన్లలో తరచూ కనిపించే ఒక హెచ్చరికను ప్రధాని ఈ సందర్భంగా గుర్తుచేశారు. "షార్ట్‌కట్ విల్ కట్ యు షార్ట్" (అడ్డదారి మీ జీవితాన్ని కుదిస్తుంది) అనే బోర్డు కేవలం రైల్వే ట్రాక్‌లకే కాకుండా, నిజ జీవితానికి కూడా వర్తిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నప్పటికీ, త్వరగా వెళ్లాలనే తొందరలో కొందరు ప్రమాదకరంగా పట్టాలు దాటుతుంటారని, అటువంటి అనాలోచిత నిర్ణయాలు ప్రాణాంతకమని ఆయన హెచ్చరించారు. యువత తప్పుడు మార్గాలను వీడి, అర్థవంతమైన జీవన గమనాన్ని ఎంచుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "మీరు ఆరాధించే మహనీయుల జీవిత చరిత్రలను తప్పనిసరిగా చదవండి. వాటి ద్వారా స్ఫూర్తి పొంది సరైన మార్గాన్ని కనుగొనవచ్చు" అని ఆయన యువతకు సలహా ఇచ్చారు. ముఖ్యంగా ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసే ఇన్‌ఫ్లుయెన్సర్ల కంటెంట్ పట్ల నిరంతరం జాగ్రత్తగా ఉండాలని ఆయన హితవు పలికారు.

## తెలంగాణలో రేపే 'ఉచిత ఆటోమేటిక్ కుట్టు మిషన్ల' పథకం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల (బీసీ) మహిళలకు స్వయం ఉపాధి కల్పించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అర్హులైన బీసీ మహిళలకు ఉచితంగా ఆటోమేటిక్ కుట్టు మిషన్లు పంపిణీ చేసే సరికొత్త సంక్షేమ పథకాన్ని రేపు అధికారికంగా ప్రారంభించనున్నట్లు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. శ్రమను తగ్గించి, వేగంగా పని చేసుకునేందుకు వీలుగా ఈ అధునాతన ఆటోమేటిక్ మిషన్లను అందించబోతున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వెయ్యి మంది మహిళలకు మిషన్లు అందించబోతున్నారు. లబ్ధిదారుల వయోపరిమితి, కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి, అవసరమయ్యే కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల వివరాలను మంత్రి రేపు అధికారికంగా వెల్లడిస్తారు. ఆన్‌లైన్, మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించే తేదీలను, ప్రక్రియ మార్గదర్శకాలను ప్రకటించనున్నారు.

## ఉప్పాడ తీరంలో సముద్రపు కోతకు చెక్



కాకినాడ జిల్లా ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న సముద్ర కోత సమస్య పరిష్కారానికి ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. తీవ్రమైన కోత కారణంగా దెబ్బతింటున్న ఈ తీరాన్ని పరిరక్షించేందుకు ప్రతిష్ఠాత్మక ఐఐటీ మద్రాస్‌తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో బుధవారం మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు కింద రూ.323 కోట్ల వ్యయంతో ఉప్పాడ తీరంలో రక్షణ గోడ నిర్మించనున్నారు. కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ నిధి (ఎన్డీఎంఎఫ్) ఆమోదంతో చేపట్టనున్న ఈ పనులకు ఐఐటీ మద్రాస్ సాంకేతిక సారథ్యం వహించనుంది. రక్షణ గోడకు అవసరమైన డిజైన్, సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్టు (డీపీఆర్) రూపకల్పనతో పాటు, నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను కూడా ఐఐటీ నిపుణులే చూడనున్నారు. ఈ ప్రాజెక్టుకు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ (ఎస్డీఎంఏ) నోడల్ ఏజెన్సీగా, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా వ్యవహరించనున్నాయి. తీర కోత తీవ్రత, సముద్రపు నీటి ప్రవాహాలు, అలల ప్రభావాన్ని శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ఉప్పాడ తీరానికి అత్యంత అనువైన, పటిష్ఠమైన రక్షణ చర్యలను ఐఐటీ బృందం సూచించనుంది. ఈ ఒప్పందంతో ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక ప్రక్రియ పూర్తయినందున, వచ్చే నవంబర్ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని ఉప్పాడ తీర ప్రాంత గ్రామాలు, మత్స్యకారుల రక్షణకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమని అధికారులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఐఐటీ మద్రాస్ ఓషన్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ ఎస్.ఎ.సన్నాసిరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖతీబ్ కౌసర్ బానో, ఏపీ మారిటైమ్ బోర్డ్ చీఫ్ ఇంజనీర్ జి.వి.రాఘవరావు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# సమయస్ఫూర్తితో స్పందించి అగ్నిప్రమాదాన్ని అడ్డుకున్న నాయకుడు

**బాలాజీనగర్‌లో ఇంటికి తాళం వేసి ఉండగా ఫ్రిజ్‌లో మంటలు**

**మంటలు విస్తరించకుండా చర్యలు చేపట్టిన గుండ్ల మహేందర్ రెడ్డి**

**గుమ్మడిదల(జిన్నారం), ఆగస్టు 12 (నేటి ప్రస్థానం):** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలంలోని బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీనగర్‌లో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు గుండ్ల మహేందర్ రెడ్డి సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఇంటి యజమానులు రాంప్రసాద్, మానస దంపతులు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సమయంలో ఫ్రిజ్‌లో అకస్మాత్తుగా మంటలు చెలరేగినట్లు స్థానికులు తెలిపారు. ఫ్రిజ్‌లో ప్రారంభమైన మంటలు ఇంట్లోని ఇతర సామగ్రికి వ్యాపించడంతో పాటు దట్టమైన పొగ కమ్ముకుంది. విషయాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే గుండ్ల మహేందర్ రెడ్డికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఆయన ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లో దట్టమైన పొగ కమ్ముకున్నప్పటికీ పరిస్థితిని అంచనా వేసి లోపలికి వెళ్లిన ఆయన మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం మంటలు చెలరేగుతున్న ఫ్రిజ్‌ను ఇంటి నుంచి బయటకు తీసుకువచ్చారు. దీంతో మంటలు మరింత విస్తరించే అవకాశం లేకుండా చేసి ప్రమాద తీవ్రతను తగ్గించారు. ఈ సందర్భంగా గుండ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాన్ని చూసి ఫొటోలు, వీడియోలు తీస్తూ ఉండకుండా సాధ్యమైనంత త్వరగా స్పందించాలని సూచించారు. ప్రమాద సమయంలో అప్రమత్తంగా వ్యవహరించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చున్నారు. ముఖ్యంగా యువత అత్యవసర సమయాల్లో బాధితులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే స్పందించి మంటలు మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టిన గుండ్ల మహేందర్ రెడ్డి తీరును బాలాజీనగర్ స్థానికులు అభినందించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పేర్కొంటూ కృతజ్ఞతలు తెలిపారు.

# మహిళా సంఘాలకు కొత్త అవకాశాలు..

**ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీతక్క**

**మహిళా సంఘాలకు మిల్లింగ్ రంగంలో కొత్త అవకాశాలు**

**ధాన్యం నిల్వ కేంద్రాలతో ఉపాధి, ఆదాయ మార్గాలు**

**మహిళా సంఘాలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యం: సీతక్క**



హైదరాబాద్, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం): మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసి, గ్రామీణ మహిళలకు మరిన్ని ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు అప్పగించాలన్న సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం మహిళా సాధికారతలో మరో ముందడుగని ఆమె పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. ఈ నిర్ణయంపై మహిళల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మిల్లింగ్ రంగంలో మహిళా సంఘాలకు అవకాశం కల్పించడం ద్వారా గ్రామీణ మహిళలకు కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని సీతక్క తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల వారికి అదనపు ఆదాయ మార్గాలు లభిస్తాయని చెప్పారు. మిల్లింగ్‌తో పాటు ధాన్యం నిల్వ, నిర్వహణ వంటి రంగాల్లోనూ మహిళా సంఘాలకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం మహిళా సంఘాల సాధికారతకు మరింత ఊతమిస్తుందని, భవిష్యత్తులో వారిని మరింత బలోపేతం చేసి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

## హర్ ఘర్ తిరంగా నినాదంతో

# గుమ్మడిదలలో దేశభక్తి ర్యాలీ





**విద్యార్థులతో కలిసి బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ**

**జాతీయ జెండాలతో మార్మోగిన మున్సిపాలిటీ కేంద్రం**

**దేశభక్తి, జాతీయ సమైక్యతను చాటిన విద్యార్థులు**

**గుమ్మడిదల, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం):** 3 రోజుల్లో రానున్న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ కన్వీనర్ నర్సంపల్లి రాజిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చింతల యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో ఏఎస్ విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు, నాయకులు 'హర్ ఘర్ తిరంగా', 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేస్తూ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఉత్సాహంగా ర్యాలీ నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను ప్రతిబింబించేలా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ర్యాలీ సందడిగా సాగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ యువత, విద్యార్థుల్లో దేశభక్తి భావాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు చిన్ననాటి నుంచే దేశం పట్ల బాధ్యత, జాతీయ సమైక్యత, దేశభక్తిపై అవగాహన కల్పించడం అవసరమన్నారు. ఏఎస్ విద్యా విహార్ పాఠశాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా నిర్వహించి దేశ ప్రగతిలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌చార్జి కొండా లక్ష్మణ్ గుప్తా, కౌన్సిలర్ గిద్దె విజయలక్ష్మి, పలుగు గోవర్ధన్ రెడ్డి, బుచ్చగారి రాంరెడ్డి, గొల్లెనా విజయ్ కుమార్, జైపాల్ రెడ్డి, విజయ్ కుమార్, సాయినేత, శివరాత్రి రాజు, వెంకట్, సృజల్ రెడ్డి, అరవింద్, గణేష్, రాజుతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# పటాన్‌చెరులో ఘనంగా తిరంగా యాత్ర

**దేశభక్తి నినాదాలతో ఉత్సాహంగా సాగిన యాత్ర**

**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి: మాద్రి పృథ్వీరాజ్**




**గుమ్మడిదల(పటాన్‌చెరు), ఆగస్టు 12 (నేటి ప్రస్థానం):** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు పట్టణంలో యువజన వికాస్ సమితి ఆధ్వర్యంలో తిరంగా యాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ యాత్రలో బీఆర్ఎస్ నాయకుడు, ఎండీఆర్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. జాతీయ జెండాలను చేతబూని దేశభక్తి నినాదాలు చేస్తూ నిర్వహించిన తిరంగా యాత్రలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, సౌభ్రాతృత్వం, జాతీయ స్ఫూర్తిని చాటుతూ యాత్ర ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు వారి ఆశయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని యువతలో పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని, వారిలో దేశభక్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, జాతీయ స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడటంలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు.

# చర్చకు తానెప్పుడూ సిద్ధమే

**చర్చ లేకుండా చేస్తున్నదే విపక్షం.. హోంమంత్రి అమిత్ షా స్పష్టీకరణ**

న్యూఢిల్లీ,: పార్లమెంట్‌లో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తానన్నారు. పార్లమెంటు కార్యకలాపాలకు పదేపదే అడ్డంకులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ప్రతిష్టంభనకు తెరదించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. అన్ని అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. అయితే సభలో చర్చ జరగాలా? ఆందోళన కొనసాగాలా? అనేది ప్రతిపక్షమే నిర్ణయించుకోవాలన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలనుంచి గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు.. 24 గంటల పాటు ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగడానికి అందుబాటులో ఉంటానని చెప్పారు. చర్చ జరపాలని ప్రతిపక్షాలు అధికారికంగా లేఖ రాస్తే.. చర్చ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బుధవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో అమిత్ షా మీడియాతో మాట్లాడుతూ.. 'సమావేశాలు మొదలైన నాటినుంచి పార్లమెంట్‌కు వస్తున్నాను. నా ఛాంబర్‌లో కూర్చుంటున్నాను. పార్లమెంట్ కార్యక్రమాలు సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటుంటే.. ఎవరైనా ఏం చేస్తారు?. వాళ్లు చర్చ జరగడానికి అంగీకరించరు. దీన్ని బట్టి ఎవరు పారిపోతున్నారో ప్రజలే అర్థం చేసుకుంటారని అన్నారు. చర్చకు సిద్ధంగా ఉన్న ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాయాలని సూచించారు.

# తెలంగాణ పేదలకు గుడ్‌న్యూస్?..

**11.56 లక్షల ఇళ్ల కోసం కేంద్రంపై ం పొంగులేటి ఒత్తిడి**

**11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని కేంద్రానికి పొంగులేటి విజ్ఞప్తి**

**'ఆవాస్ ప్లస్--2024' సర్వేలో 11.56 లక్షలకు పైగా కుటుంబాలు అర్హులుగా గుర్తింపు**

**ప్రతి పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం**

**తెలంగాణ పర్యటనకు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు పొంగులేటి ఆహ్వానం**



హైదరాబాద్, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం): తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ (గ్రాపీహ్--+ 2.0) కింద 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కేంద్రాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. 'ఆవాస్ ప్లస్--2024' యాప్ ద్వారా నిర్వహించిన ఇంటింటి సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా గుర్తించామని, సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలు ఏడాది క్రితమే పూర్తయ్యాయని తెలిపారు. గత 12 ఏళ్లుగా రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో భారీ డిమాండ్ ఉందని, ఇళ్ల కేటాయింపులో జాప్యం లేకుండా వెంటనే లక్ష్యాన్ని ప్రకటించాలని కోరారు.ాపీహ్--+ కింద కేంద్ర, రాష్ట్ర వాటాలతో సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే బడ్జెట్‌లో కేటాయించినట్లు వెల్లడించారు. తెలంగాణలో పర్యటించి ్రాపీహ్--+ 2.0 కింద ఇళ్ల కేటాయింపును స్వయంగా ప్రకటించాలని కేంద్ర మంత్రి చౌహాన్‌ను ఆహ్వానించగా, ఆయన సానుకూలంగా స్పందించి రాష్ట్ర పర్యటనకు అంగీకరించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక



# బొల్లారంలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

## దేశభక్తి నినాదాలతో మార్మోగిన బొల్లారం..

## 2,500 మందికి పైగా ప్రజల పాల్గొనడం

**గుమ్మడిదల(జిన్నారం), ఆగస్టు 12 (నేటి ప్రస్థానం) :** హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారంలో బుధవారం భారీ దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలనే సందేశంతో నిర్వహించిన ఈ ర్యాలీకి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది.బొల్లారం జీహెచ్ఎంసీ 272వ డివిజన్ సామాజిక కార్యకర్త, నాయకుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. బొల్లారం టౌన్ సీఐ సుధీర్ కుమార్ జాతీయ జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం దేశభక్తి నినాదాలతో ర్యాలీ ఉత్సాహభరితంగా కొనసాగింది. ర్యాలీలో వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మేధావులు, యువతతో పాటు సుమారు 2,500 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేశారు. జాతీయ జెండాలతో నిర్వహించిన ర్యాలీతో బొల్లారం వీధులు దేశభక్తి నినాదాలతో మార్మోగాయి. హర్ ఘర్ తిరంగా సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమం కొనసాగింది.

# మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

## వ్యక్తిగత పొదుపు, బీమా పథకాలపై అవగాహన

## కుటుంబ సభ్యులకూ బీమా చేయించాలని సూచన



**గుమ్మడిదల, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం):** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట-1 గ్రామ సంఘం అధ్యక్షురాలు పూజ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ప్రతినిధులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత పొదుపు ఆవశ్యకత, ప్రమాద బీమా, జీవన బీమా పథకాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ప్రతి సభ్యురాలు వ్యక్తిగతంగా పొదుపు చేయడంతో పాటు కుటుంబ ఆర్థిక భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన వంటి బీమా పథకాలను ప్రతి సభ్యురాలు సద్వినియోగం చేసుకోవాలని, తమతో పాటు కుటుంబ సభ్యులకు కూడా బీమా చేయించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు. అనుకోని ప్రమాదాలు, కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పుడు బీమా పథకాలు కొంత మేర ఆర్థిక భద్రత కల్పిస్తాయని వివరించారు. మహిళలు పొదుపు అలవాటును పెంపొందించుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆర్థిక భద్రతా పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు పొదుపు, బీమా ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సంఘం పాలకవర్గ సభ్యులు, ఏపీఎం నరేందర్, సీసీ వరలక్ష్మి, వీవోఏ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# తిరంగా యాత్రతో పటాన్‌చెరులో దేశభక్తి సందేశం

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

## దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





**గుమ్మడిదల(పటాన్‌చెరు), ఆగస్టు 12 (నేటి ప్రస్థానం):** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువత శక్తిని సక్రమమైన మార్గంలో వినియోగించినప్పుడే దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశభక్తి, జాతీయ సమైక్యత, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై యాత్రను ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూనిన విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో పటాన్‌చెరు వీధులు దేశభక్తి నినాదాలతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. వారి ఆశయాలను భావితరాలకు అందించి ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందన్నారు. విద్య, క్రీడలు, విజ్ఞానం, సాంకేతిక రంగాల్లో యువత రాణిస్తూ దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని సూచించారు. మాదక ద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలు దెబ్బతినడంతో పాటు నేర ప్రవృత్తి పెరిగే ప్రమాదం ఉందన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ తమ జీవితాలను ఉన్నత లక్ష్యాల వైపు మలుచుకోవాలని సూచించారు.మాదక ద్రవ్యాల నియంత్రణ కేవలం ప్రభుత్వ యంత్రాంగం బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, పోలీసులు, ప్రజలు సమష్టిగా బాధ్యత తీసుకోవాలని అన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించి మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. తిరంగా యాత్ర వంటి కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన, మాదక ద్రవ్యాలకు దూరమైన యువతతోనే బలమైన భారతదేశాన్ని నిర్మించగలమన్నారు. యాత్రను నిర్వహించిన యువజన వికాస సమితి ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, బల్వంత్, హమీద్, ధనరాజ్, షకీల్, కొండల్, టింకు, యువజన వికాస సమితి అధ్యక్షుడు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి విజయ్ గౌడ్, యువత, విద్యార్థులు, వివిధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# తెలంగాణలో పోలింగ్ స్టేషన్లలో భారీ మార్పులు.. ఈసీ కీలక నిర్ణయం

## పోలింగ్ కేంద్రాల మార్పులు, పేర్ల మార్పులకు ఈసీ ఆమోదం

## కొత్త కేంద్రాల ఏర్పాటుతోపాటు కొన్ని కేంద్రాల తొలగింపు, విలీనం

## జిల్లా వారీగా మార్పుల జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం




**హైదరాబాద్, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం):** తెలంగాణలో పోలింగ్ కేంద్రాల వ్యవస్థలో కీలక మార్పులకు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదముద్ర వేసింది. ఓటర్ల సౌకర్యం, పరిపాలనా అవసరాలను దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు ఈసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా పలు పోలింగ్ కేంద్రాల పేర్లు, ప్రదేశాల్లో మార్పులతోపాటు కొత్త కేంద్రాల ఏర్పాటుకు అనుమతి లభించింది. కొన్ని కేంద్రాలను తొలగించడం, మరికొన్నింటిని విలీనం చేసేందుకు కూడా ఈసీ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని పోలింగ్ స్టేషన్లను మరింత సౌకర్యవంతంగా, హేతుబద్ధంగా ఏర్పాటు చేసే ప్రక్రియలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. వివిధ జిల్లాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను పరిశీలించిన అనంతరం మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలకు ఈసీ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కొన్ని పోలింగ్ కేంద్రాల ప్రదేశాలను మార్చడంతోపాటు, అవసరమైన చోట కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే, పేర్ల మార్పు అవసరమైన పోలింగ్ కేంద్రాలకు కొత్త పేర్లు ఖరారు చేయడానికి అనుమతి ఇచ్చారు. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అవసరం లేని లేదా సమీపంలోని మరో కేంద్రంతో కలపగలిగే పోలింగ్ కేంద్రాలను తొలగించడం, విలీనం చేయడం వంటి మార్పులు కూడా చేపట్టనున్నారు. ఈ మేరకు ఆయా జిల్లాల వారీగా పోలింగ్ కేంద్రాల్లో చేపట్టనున్న మార్పుల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మార్పులు జరిగిన పోలింగ్ కేంద్రాలు, వాటి కొత్త ప్రదేశాలు, పేర్లు తదితర వివరాలను ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలని ఎన్నికల అధికారులను ఈసీ ఆదేశించింది. ఈ ఆదేశాల మేరకు తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) కార్యాలయం బుధవారం మెమో జారీ చేసింది. పోలింగ్ కేంద్రాల మార్పులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారులకు సూచించింది.

# సిరిసిల్లలో స్వాతంత్ర్య వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు.. పరేడ్ గ్రౌండ్ పరిశీలన

## పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## దయాస్, సీటింగ్, సౌండ్ సిస్టమ్, తాగునీటి ఏర్పాట్లపై పరిశీలన

## అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ ఆదేశం

సిరిసిల్ల, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 15న జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం పరిశీలించారు. అధికారులతో కలిసి పరేడ్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఆయన.. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. వేడుకల సందర్భంగా డయాస్ ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్, సౌండ్ సిస్టమ్, అవసరమైన కుర్చీలు, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పరిశీలనలో ఆర్డీవో సిరిసిల్ల శ్రీధర్‌బాబు, తహసీల్దార్ మహేష్‌కుమార్, కలెక్టరేట్ ఏవో రాంరెడ్డి, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






### 'భారతమాతకు జై' నినాదాలతో

# హోరెత్తిన ఖానాపూర్..

**ఘనంగా హర్ ఘర్ తిరంగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించిన విద్యార్థులు**

**'భారతమాతకు జై', 'వందేమాతరం' నినాదాలతో మార్మోగిన ఖానాపూర్**

**దేశభక్తి స్ఫూర్తిని పెంపొందించడమే హర్ ఘర్ తిరంగా లక్ష్యం: రితీశ్ రాథోడ్**

**ఖానాపూర్, ఆగస్టు 12(నేటి ప్రస్థానం):** 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ పట్టణంలో విద్యార్థులు నిర్వహించిన భారీ ర్యాలీ దేశభక్తి నినాదాలతో హోరెత్తింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ పరిధిలోని ఐబీ చౌరస్తా నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని ర్యాలీ నిర్వహించారు. 'భారతమాతకు జై', 'వందేమాతరం' నినాదాలతో పట్టణ వీధులు మార్మోగాయి. విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగిన తీరు చూపరులను ఆకట్టుకుంది. ర్యాలీలో చిన్నారుల నుంచి యువత వరకు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తిని చాటారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా భాజపా అధ్యక్షుడు రితీశ్ రాథోడ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. జాతీయ జెండా దేశ గౌరవానికి ప్రతీక అని, ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా ప్రజల్లో దేశభక్తి భావనను పెంపొందించడమే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అంకం మౌనికతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ఎంజీయూ ఔట్‌సోర్సింగ్ నియామకాలపై ఆరోపణలు..

**రిజర్వేషన్లపై కమిషన్‌కు ఫిర్యాదు**

**ఔట్‌సోర్సింగ్ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించలేదని ఆరోపణ**

**రోస్టర్ విధానంపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు**

**నియామకాలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్**



నల్గొండ, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం): మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియపై విద్యార్థి సంఘ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నియామకాల్లో రోస్టర్ విధానం, రిజర్వేషన్లు పాటించలేదని ఆరోపిస్తూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నల్గొండ జిల్లా కార్యాలయంలో కమిషన్ ప్రతినిధులకు వినతిపత్రం అందజేసి, నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఎలాంటి ఉద్యోగ ప్రకటన ఇవ్వకుండానే ఎస్సీ, మాదిగ సామాజిక వర్గాలకు కేటాయించాల్సిన పోస్టులను పక్కదారి పట్టించారని విద్యార్థి నాయకుడు అనుముల సురేష్ మాదిగ ఆరోపించారు. నియామకాల్లో నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ నిబంధనల అమలుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరారు. కాగా, విద్యార్థి సంఘ నాయకులు చేసిన ఆరోపణలపై మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ అధికారుల స్పందన వెలువడాల్సి ఉంది.

## క్రషర్ నిర్మాణం నిలిపివేయాలని పహిల్వాన్ పురం గ్రామస్తుల ఆందోళన

**యాదాద్రి భువనగిరి:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పహిల్వాన్ పురం గ్రామంలో నిర్మించ తలపెట్టిన క్రషర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని పైల్వాన్ పురం గ్రామానికి చెందిన ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన రైతులు గ్రామపంచాయతీ వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎలిమినేటి జంగారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో అక్రమంగా నిర్మిస్తున్న క్రషర్ నిర్మాణాన్ని గ్రామ ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా సర్పంచ్ ఏకపక్షంగా తీర్మానం చేసి క్రషర్ నిర్మాణానికి అనుమతులు ఇచ్చారని గ్రామ సభలో ప్రజలు క్రషర్ నిర్మాణాన్ని చేపట్టవద్దని చెప్పినా వినకుండా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా సర్పంచ్ ప్రయత్నిస్తున్నారని, క్రషర్ లీజు ఉన్న సర్వే నెంబర్లలో నిర్మాణాలు చేపట్టకుండా రైతులకు నష్టం కలిగించే విధంగా పొలాల మధ్యలో నిర్మాణం చేపట్టడం వల్ల అక్కడ పంట పొలాలు చెడిపోయి పశుపక్షాదులు పెంచడానికి సైతం ఇబ్బంది ఉంటుందని రైతులు తమ ఆవేదన వెలిబుచ్చారు.

# ఎంత కష్టం!



**ఉధృత వాగును దాటి..**

**గర్భిణిని డోలీలో ఆస్పత్రికి తరలింపు**

**ఏడునెలల గర్భిణిని డోలీలో కూర్చోబెట్టి ఉధృత వాగు దాటించిన గ్రామస్తులు**

**కెరమెరి ఆస్పత్రికి తరలింపు.. మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్‌కు రిఫర్**

**మారుమూల గ్రామాలకు శాశ్వత వంతెన నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి**

**ఆసిఫాబాద్, ఆగస్టు 12(నేటి ప్రస్థానం):** అత్యవసర వైద్యం కోసం ఆస్పత్రికి వెళ్లాల్సిన గర్భిణికి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు అడ్డంకిగా మారింది. రాకపోకలు నిలిచిపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ప్రాణాలకు తెగించి ఆమెను డోలీలో కూర్చోబెట్టి వరద వాగును దాటించారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కొలాంగూడలో ఈ ఘటన చోటుచేసుకుంది. కొలాంగూడకు చెందిన కొడప రాజేశ్వరికి అత్యవసర వైద్యం అవసరం కావడంతో ఆస్పత్రికి తరలించాల్సి వచ్చింది. అయితే భారీ వర్షాలతో స్థానిక వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే స్పందించారు. గర్భిణిని డోలీలో కూర్చోబెట్టి జాగ్రత్తగా మోసుకుంటూ ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును దాటించి కెరమెరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు గర్భిణి కడుపులో పిండం కదలికలు లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం ఆసిఫాబాద్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. అత్యవసర సమయంలో గ్రామస్తులు స్పందించిన తీరుపై ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. అదే సమయంలో మారుమూల గ్రామాల్లో వాగుల కారణంగా అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో శాశ్వత వంతెనలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

# సీఎం పర్యటనకు పరకాల ముస్తాబు..

**ఏర్పాట్లపై అధికారులకు ఎమ్మెల్యే కీలక ఆదేశాలు**

**16న పరకాలకు సీఎం రేవంత్‌రెడ్డి.. భారీ ఏర్పాట్లకు అధికార యంత్రాంగం సిద్ధం**

**సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్, భద్రతపై ప్రత్యేక దృష్టి**

**తాగునీరు, వైద్యం, విద్యుత్, పారిశుధ్యంపై ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశం**





హనుమకొండ, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం): ఈ నెల 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరకాల పట్టణంలో పర్యటించనున్న నేపథ్యంలో అధికారులు పకడ్బందీ ఏర్పాట్లకు సిద్ధమవుతున్నారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం హనుమకొండ కలెక్టరేట్‌లో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, డాక్టర్ సత్యశారదతో కలిసి ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సీఎం పర్యటనకు సంబంధించి వేదిక, సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, బారికేడింగ్, తాగునీరు, పారిశు ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, అగ్నిమాపక చర్యలు, భద్రత, హెలిప్యాడ్ తదితర ఏర్పాట్లపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే పార్కింగ్ ప్రాంతాలను గుర్తించి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్య సిబ్బంది, వైద్య బృందాలు, అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని తెలిపారు. పోలీస్, రెవెన్యూ, మున్సిపల్, వైద్య ఆరోగ్య, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, అగ్నిమాపక, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సీఎం పర్యటనకు సంబంధించిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, చివరి నిమిషంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు రవి, గణేష్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీవోలు, జెడ్పీ సీఈవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈదులగూడెం అంగన్వాడి కేంద్రానికి ఆటవస్తులు అందజేసిన మాశెట్టి

**శ్రీనివాస్ మిర్యాలగూడ ఆగష్టు 12:- :** మిర్యాలగూడ నేత్రనిధి వ్యవస్థాపాక అధ్యక్షుడు, లయన్స్ డైమండ్ క్లబ్ డైమండ్ మాశెట్టి శ్రీనివాస్ ఈదులగూడెం అంగన్వాడి రెండవ సెంటర్ పిల్లలకు ఆయన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా ఆట వస్తువులు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తమ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చెపడుతున్నామని ఆయన అన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ బొందు పార్వతీ, హెల్పర్ జి.లక్ష్మి, ఆశా వర్కర్ నవ్య, స్రవంతి ఎఎన్ఎం విజయ తదితరులు పాల్గొన్నారు

# సీపీఎస్ రద్దు..

**ఓపీఎస్ పునరుద్ధరణే లక్ష్యం.. 23న 'చలో హైదరాబాద్'**

**సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని ఉద్యోగుల డిమాండ్**

**ఈ నెల 23న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ**

**ప్రతి సీపీఎస్ ఉద్యోగి సభకు తరలిరావాలని పిలుపు**



బాన్సువాడ, ఆగస్టు 12 (నేటి ప్రస్థానం): కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలనే డిమాండ్‌తో ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యమాన్ని ఉధృతం చేయనున్నారు. ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని డాక్టర్ భట్టు విఠల్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బాన్సువాడ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం 'చలో హైదరాబాద్' పోస్టర్లను ఆవిష్కరించారు. సీపీఎస్ ఉద్యోగుల భవిష్యత్తు, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని భట్టు విఠల్ డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ తదితర ప్రయో జనాలతో పాటు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరి ంచాలని కోరారు. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. ఈ నెల 23న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో ప్రతి సీపీఎస్ ఉద్యోగి బాధ్యతగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జూనియర్ కళాశాలల కన్వీనర్లు యాదగౌడ్, నర్సింలు, రామేశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

## మహిళల ఆరోగ్యమే ప్రభుత్వ బాధ్యత

**ప్రభుత్వ నిప్పు బీర్ల ఐలయ్య**

**ఆలేరు, ఆగస్టు 12 :** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారి ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం శారాజీపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా బీపీ, షుగర్, గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ముందస్తు వైద్య పరీక్షలు ఎంతో అవసరమన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేల రూపాయలు ఖర్చయ్యే పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా సమీప ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తోందని తెలిపారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక

# వర్షానికి బూట్లు తడిసాయా..? దుర్వాసన రాకుండా త్వరగా ఆరిపోవాలంటే.. సింపుల్ గా ఇలా చేయండి..!

వర్షాకాలంలో తడి బూట్లను ఆరబెట్టడానికి చిట్కాలు: వార్తాపత్రిక, గాలిలో ఆరబెట్టడం, హెయిర్ డ్రైయర్, సిలికా జెల్ ఉపయోగించండి. వర్షాకాలం వచ్చిందంటే గొడుగు, రెయిన్‌కోట్ వాడటం మొదలు పెడుతుంటాం.. అయితే ఈ సమయంలో చాలా మంది ఎదుర్కొనే పెద్ద సమస్య తడి బూట్లు. ముఖ్యంగా స్కూల్ విద్యార్థులు, ఆఫీస్ కు వెళ్లే వారు ఈ సమస్యను అధికంగా ఎదుర్కొంటూ ఉంటారు. బయటకు వెళ్లినప్పుడు వర్షంలో బూట్లు పూర్తిగా తడవడం సహజమే. అయితే వాటిని సరైన పద్ధతిలో ఆరబెట్టకపోతే లోపల తేమ పేరుకుపోయి దుర్వాసన రావడం, బూట్ల ఆకారం మారడం, చివరకు అవి త్వరగా పాడైపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అందుకే తడి బూట్లను ఎలా సంరక్షించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. వర్షంలో బూట్లు పూర్తిగా తడిస్తే ముందుగా వాటిలో ఉన్న అదనపు నీటిని తొలగించాలి. బూట్లను మెల్లగా నొక్కి నీటిని బయటకు వచ్చేలా చేయాలి. అయితే బలంగా మెలిపెట్టడం మాత్రం చేయకూడదు. అలా చేస్తే బూట్ల కుట్లు సడలిపోవడంతో పాటు వాటి అసలు ఆకారం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. వీలైతే లేసులు, ఇన్సోల్స్‌ను తీసి విడిగా ఆరబెట్టడం వల్ల ప్రతి భాగానికి గాలి బాగా చేరి త్వరగా ఆరిపోతాయి. తడి బూట్లను ఆరబెట్టడానికి ఇంట్లోనే సులభంగా ఉపయోగపడే చిట్కా పాత వార్తాపత్రిక. బూట్ల లోపల వార్తాపత్రికను గట్టిగా కుక్కితే అది తేమను వేగంగా పీల్చుకుంటుంది. దీంతో బూట్ల లోపల ఉండే నీరు త్వరగా తగ్గిపోతుంది. ఒకవేళ బూట్లు ఎక్కువగా తడిగా ఉంటే కొన్ని గంటల తర్వాత పాత వార్తాపత్రికను తీసేసి కొత్తది పెట్టడం మంచిది. ఇలా చేయడం వల్ల బూట్లు త్వరగా పొడిగా మారడమే కాకుండా వాటి ఆకారం కూడా అలాగే ఉంటుంది. చాలామంది చేసే పొరపాటు తడి బూట్లను నేరుగా ఎండలో పెట్టడం. కానీ ఇలా చేయడం వల్ల బూట్ల రంగు వెలిసిపోవచ్చు. అంతేకాదు, వాటిలో ఉపయోగించే జిగురు బలహీనపడి బూట్లు ఊడిపోయే అవకాశం కూడా ఉంటుంది. అందుకే బూట్లను గాలి బాగా వచ్చే ప్రదేశంలో లేదా ఫ్యాన్ ముందు ఉంచి సహజంగా ఆరబెట్టడం ఉత్తమం. నెమ్మదిగా ఆరిన బూట్లు ఎక్కువకాలం మన్నుతాయి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంటే హెయిర్ డ్రైయర్‌ను కూడా ఉపయోగించవచ్చు. అయితే డ్రైయర్‌ను అధిక ఉష్ణోగ్రతలో ఉపయోగించకుండా తక్కువ వేడి వద్ద దూరంగా ఉంచి అటూ ఇటూ కదుపుతూ ఆరబెట్టాలి. ఒకే చోట ఎక్కువసేపు వేడి తగిలితే బూట్ల బట్ట, తోలు లేదా జిగురు దెబ్బతినే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ పద్ధతిని జాగ్రత్తగా ఉపయోగించడం అవసరం. ఇంట్లో సిలికా జెల్ ప్యాకెట్లు ఉంటే వాటిని కొన్ని గంటల పాటు బూట్లలో ఉంచినా మంచి ఫలితం ఉంటుంది. అలాగే కొద్దిగా ఉప్పును శుభ్రమైన గుడ్డలో చుట్టి బూట్లలో ఉంచినా తేమ త్వరగా తగ్గుతుంది. ఈ రెండు పద్ధతులు తడి వల్ల వచ్చే దుర్వాసనను కూడా తగ్గించడంలో సహాయపడతాయి. చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే వర్షాకాలంలో కూడా మీ బూట్లు ఎక్కువకాలం కొత్తవాటిలాగే ఉండటంతో పాటు దుర్వాసన సమస్యకు కూడా సులభంగా చెక్ పెట్టొచ్చు.



# చికెన్, మటన్ కంటే ఖరీదు.. ఈ కూరగాయ ధర కిలో రూ.1,200.. అయినా తగ్గని డిమాండ్..!

లఖింపూర్ ఖేరీలో కటరువా అనే అరుదైన కూరగాయ కిలో రూ.1,000–1,200 పలుకుతోంది. ప్రోటీన్, పోషకాలు అధికంగా ఉండటంతో దీనికి భారీ డిమాండ్ ఉంది. వర్షాకాలం రాగానే ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీ జిల్లా అడవుల్లో ఒక అరుదైన కూరగాయ కోసం ప్రత్యేక హడావిడి మొదలవుతుంది. స్థానికంగా కటరువాగా పిలిచే ఈ అరుదైన అడవి కూరగాయ మార్కెట్‌లో కిలో ధర ఏకంగా రూ.1,000 నుంచి రూ.1,200 వరకు పలుకుతోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. దీని ధర చాలాసార్లు చికెన్, మటన్ కంటే కూడా ఎక్కువగా ఉంటుంది. అయినప్పటికీ, దీని కోసం వినియోగదారులు ఏటా వర్షాకాలం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. టెరాయ్ ప్రాంత ప్రజలకు కటరువా ఒక సాధారణ కూరగాయ కాదు. దీనిని శాకాహారుల కోసం మాంసాహారం అని కూడా పిలుస్తుంటారు. ఇందులో ప్రోటీన్ పుష్కలంగా ఉండటంతో పాటు ప్రత్యేకమైన రుచి ఉండటమే దీనికి ఉన్న భారీ డిమాండ్‌కు ప్రధాన కారణంగా స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ప్రారంభంలో దీని ధర ఆకాశాన్నంటినా, అభిమానులు మాత్రం వెనక్కి తగ్గకుండా కొనుగోలు చేస్తుంటారు. పోషక విలువల పరంగా కూడా కటరువాకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇందులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. దీనిని ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభించడంతో పాటు అలసట, నీరసం తగ్గే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. కొందరు నిపుణుల అభిప్రాయం ప్రకారం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా ఇది కొంతవరకు సహాయపడవచ్చని చెబుతున్నారు. అంతేకాదు, గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కూడా కటరువా ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. ఇందులోని పోషకాలు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో తోడ్పడతాయని, శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఉపయోగకరంగా ఉండవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే ఈ ప్రయోజనాలపై మరింత శాస్త్రీయ పరిశోధన అవసరమని కూడా చెబుతున్నారు. కటరువా భూమి అడుగున పెరిగే ప్రత్యేకమైన అడవి ఉత్పత్తి. అందువల్ల అది మట్టి, బురదతో పూర్తిగా కప్పబడి ఉంటుంది. వండే ముందు దానిని బాగా శుభ్రం చేయాల్సి ఉంటుంది. వర్షాకాలంలో శారీరక బలహీనత, నీరసాన్ని తగ్గించేందుకు చాలామంది దీనిని ప్రత్యేకంగా ఆహారంలో చేర్చుకుంటారు. ఈ అరుదైన కూరగాయ ప్రధానంగా టెరాయ్ అడవుల్లోని సాల్, టేకు చెట్ల వేళ్ల సమీపంలో పెరుగుతుంది. స్థానికులు అడవుల్లోకి వెళ్లి నేలను తవ్వి దీనిని సేకరిస్తారు. అయితే అడవుల నుంచి దీన్ని సేకరించడంపై నిబంధనలు ఉన్నప్పటికీ, అక్రమంగా వెలికితీస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిషేధం ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో మార్కెట్‌లలో ఇది బహిరంగంగానే విక్రయించబడుతోందని స్థానికులు చెబుతున్నారు. అరుదుగా లభించడం, ప్రత్యేకమైన రుచి, అధిక పోషక విలువలు, భారీ డిమాండ్... ఈ నాలుగు కారణాల వల్లే కటరువా ప్రతి వర్షాకాలంలో హాట్ టాపిక్‌గా మారుతోంది. సాధారణ కూరగాయలతో పోలిస్తే ఎన్నో రెట్లు అధిక ధర ఉన్నప్పటికీ, దీని కోసం వినియోగదారులు వెనుకాడటం లేదు. వర్షాకాలం వస్తే చాలు... కటరువా కోసం అడవులు, మార్కెట్‌లు మళ్లీ సందడిగా మారిపోతున్నాయి.



# బ్లడ్ క్యాన్సర్‌ను ముందగానే గుర్తించకపోవడానికి 5 కారణాలివే.. లైట్ తీసుకుంటే డేంజర్!

ఇతర క్యాన్సర్ల మాదిరిగా ఇవి శరీరంలో గడ్డల రూపంలో కనిపించవు. రక్తం, ఎముక మజ్జ, లింఫాటిక్ వ్యవస్థలో నెమ్మదిగా ప్రారంభమయ్యే ఈ వ్యాధి తొలి దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించవు. అందుకే చాలా మందిలో వ్యాధి ముదిరిన తర్వాతే రక్త క్యాన్సర్ ఉన్నట్లు తెలుస్తోంది. గుర్గావ్‌లోని ఫోర్టిస్, హెమటాలజీ మరియు బీఎమ్‌టి విభాగపు ప్రిన్సిపల్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ భార్గవ మాట్లాడుతూ, భారతదేశంలో రక్త క్యాన్సర్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. జాతీయ క్యాన్సర్ రిజిస్ట్రీ, అంతర్జాతీయ గణాంకాల ప్రకారం, లుకేమియా, లింఫోమా వంటి రక్త క్యాన్సర్లు పిల్లలు, పెద్దల్లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ ప్రజల్లో వీటి గురించి సరైన అవగాహన తక్కువగా ఉంది. అలసట, తరచూ జ్వరం రావడం, బరువు తగ్గడం, పదేపదే ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి లక్షణాలను చాలామంది సాధారణ ఆరోగ్య సమస్యలుగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. దీంతో చికిత్స ఆలస్యమవుతుంది. ఫోర్టిస్ గురుగ్రామ్‌కు చెందిన హీమటాలజీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణుడు డాక్టర్ రాహుల్ భార్గవ మాట్లాడుతూ, “రక్త క్యాన్సర్ లక్షణాలు సాధారణ అనారోగ్య సమస్యల మాదిరిగానే ఉండటం వల్ల ప్రారంభ దశలో గుర్తించడం కష్టమవుతుంది. బయటకు ఆరోగ్యంగా కనిపించినా లోపల వ్యాధి వేగంగా పెరుగుతూ ఉండొచ్చు. అందుకే ముందుగానే గుర్తిస్తే చికిత్స మరింత ప్రభావవంతంగా ఉంటుంది” అని తెలిపారు. ప్రారంభంలో స్పష్టమైన లక్షణాలు కనిపించవు రక్త క్యాన్సర్ వచ్చిన వెంటనే శరీరంలో గడ్డలు లేదా తీవ్రమైన నొప్పి వంటి లక్షణాలు కనిపించవు. అలసట, బలహీనత, స్వల్ప జ్వరం, తరచూ ఇన్‌ఫెక్షన్లు వంటి సాధారణ లక్షణాలే మొదట కనిపిస్తాయి. ఇవి రోజువారీ జీవితంలో చాలామందికి కనిపించే సమస్యలు కావడంతో వాటిని పెద్దగా పట్టించుకోరు. ఈ నిర్లక్ష్యమే వ్యాధి ఆలస్యంగా గుర్తించబడటానికి ప్రధాన కారణం. ఇతర వ్యాధులతో పోలిన లక్షణాలు ఉండటం Ωఎతీ /ґరక్త క్యాన్సర్ లక్షణాలు క్షయవ్యాధి (టీబీ), వైరల్ ఇన్‌ఫెక్షన్లు లేదా ఇతర సాధారణ వ్యాధుల లక్షణాలతో చాలా వరకు ఒకేలా ఉంటాయి. జ్వరం తగ్గకపోవడం, రాత్రిళ్లు ఎక్కువగా చెమటలు పట్టడం, కారణం లేకుండా బరువు తగ్గడం, లింఫ్ గ్రంథులు వాపు రావడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు చాలామంది సాధారణ మందులతోనే సరిపెట్టుకుంటారు. అయితే ఈ లక్షణాలు ఎక్కువ రోజులు కొనసాగితే తప్పనిసరిగా రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు చేయించుకోవాలి. రక్తహీనత, అలసటను సాధారణ సమస్యగా భావించడం Ωఎతీ /ґలుకేమియా, మైలోమా వంటి రక్త క్యాన్సర్లలో రక్తహీనత (అనీమియా), తీవ్రమైన అలసట చాలా సాధారణ లక్షణాలు. కానీ భారతదేశంలో రక్తహీనత ఎక్కువ మందిలో ఉండటం వల్ల దానిని పెద్ద సమస్యగా భావించరు. అయితే రక్తహీనత ఎక్కువకాలం కొనసాగినా, దానితో పాటు తరచూ జ్వరం, ఇన్‌ఫెక్షన్లు లేదా రక్తస్రావం వంటి సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. తరచూ ఇన్‌ఫెక్షన్లు రావడం కూడా హెచ్చరికే Ωఎతీ /ґరక్త క్యాన్సర్ శరీరంలోని రోగనిరోధక శక్తిని నేరుగా ప్రభావితం చేస్తుంది. దీంతో చిన్న చిన్న ఇన్‌ఫెక్షన్లు కూడా తరచూ వస్తుంటాయి. జలుబు, జ్వరం తగ్గినా మళ్లీ రావడం, గాయాలు త్వరగా మానకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకూడదు. తరచూ ఇన్‌ఫెక్షన్లు రావడం కూడా రక్త క్యాన్సర్‌కు సంకేతం కావచ్చు. ముందుగానే గుర్తిస్తే చికిత్స విజయవంతమవుతుంది Ωఎతీ /ґఇప్పటి వైద్యరంగంలో రక్త క్యాన్సర్ చికిత్సలో ఎన్నో ఆధునిక పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. కీమోథెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ వంటి చికిత్సలతో మంచి ఫలితాలు సాధిస్తున్నారు. అయితే ఈ చికిత్సలు పూర్తిస్థాయిలో ప్రయోజనం ఇవ్వాలంటే వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించడం చాలా ముఖ్యం. ఆలస్యమైతే ఇతర అవయవాలు దెబ్బతినడం, తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంటుంది. ముగింపుగా, అలసట, తరచూ జ్వరం, బరువు తగ్గడం, పదేపదే ఇన్‌ఫెక్షన్లు రావడం వంటి లక్షణాలను చిన్న సమస్యలుగా తీసుకోవద్దు. అవి ఎక్కువ రోజులు కొనసాగితే వెంటనే వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవడం ద్వారా రక్త క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించి చికిత్స ప్రారంభించే అవకాశం ఉంటుంది. ముందస్తు గుర్తింపే ప్రాణాలను కాపాడగల అత్యంత ప్రభావవంతమైన మార్గం.





# మీ చెక్క డోర్స్, కిటికీలు బ్బిపోయాయా..? అవి సరిగ్గా మూసుకుపోకపోతే ఇలా చేయండి చాలు

వర్షాకాలంలో చెక్క తలుపులు , కిటికీలను మూసివేయడం తరచుగా కష్టంగా మారుతుంది. అవి సులభంగా మూసుకుపోవు. ఒకసారి మూసుకున్న తర్వాత వాటిని మళ్లీ తెరవడం కూడా కష్టమవుతుంది. ఈ సమస్యను ఈజీగా పరిష్కరించే చిట్కాలు ఇవిగో ఇక్కడున్నాయి. వర్షాకాలం ప్రశాంతతను తెచ్చినప్పటికీ అది దానితో పాటు కొన్ని సమస్యలను కూడా తెస్తుంది. చెక్క తలుపులు, కిటికీలు ఉబ్బిపోవడం ఒక సాధారణ సమస్య. తరచుగా తలుపులు సరిగ్గా మూసుకోవు, కిటికీలు తెరవడానికి లేదా మూయడానికి ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుంది. చెక్క కిర్రుమని శబ్దం చేయడం మొదలవుతుంది. గాలిలో పెరిగిన తేమ వల్ల ఇది జరుగుతుంది, దీనిని చెక్క సులభంగా గ్రహిస్తుంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే, ఇది తలుపులు మరియు కిటికీల మన్నికను తగ్గిస్తుంది. అదృష్టవశాత్తూ, కొన్ని సులభమైన ఇంటి చిట్కాలతో ఈ సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. వర్షాకాలం ప్రశాంతతను తెచ్చినప్పటికీ అది దానితో పాటు కొన్ని సమస్యలను కూడా తెస్తుంది. చెక్క తలుపులు, కిటికీలు ఉబ్బిపోవడం ఒక సాధారణ సమస్య. తరచుగా తలుపులు సరిగ్గా మూసుకోవు, కిటికీలు తెరవడానికి లేదా మూయడానికి ఎక్కువ శ్రమ పడాల్సి వస్తుంది. చెక్క కిర్రుమని శబ్దం చేయడం మొదలవుతుంది. గాలిలో పెరిగిన తేమ వల్ల ఇది జరుగుతుంది, దీనిని చెక్క సులభంగా గ్రహిస్తుంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే, ఇది తలుపులు మరియు కిటికీల మన్నికను తగ్గిస్తుంది. అదృష్టవశాత్తూ, కొన్ని సులభమైన ఇంటి చిట్కాలతో ఈ సమస్యను గణనీయంగా తగ్గించవచ్చు. తలుపులు లేదా కిటికీలపై వర్షపు నీరు లేదా తేమ చేరినట్లయితే ముందుగా పొడి మైక్రోఫైబర్ వస్త్రాన్ని ఉపయోగించి వాటిని పూర్తిగా తుడవండి. ఆ తర్వాత, గదిలోని తేమను తగ్గించడానికి ఫ్యాన్ లేదా ఎగ్జాస్ట్ సిస్టమ్‌ను ఆన్ చేయండి. చెక్క ఎంత పొడిగా ఉంటే, అది ఉబ్బే అవకాశం అంత తక్కువగా ఉంటుంది.

1.పొడి వస్త్రంతో తేమను తొలగించండి.తలుపులు లేదా కిటికీలపై వర్షపు నీరు లేదా తేమ చేరినట్లయితే ముందుగా పొడి మైక్రోఫైబర్ వస్త్రాన్ని ఉపయోగించి వాటిని పూర్తిగా తుడవండి. ఆ తర్వాత, గదిలోని తేమను తగ్గించడానికి ఫ్యాన్ లేదా ఎగ్జాస్ట్ సిస్టమ్‌ను ఆన్ చేయండి. చెక్క ఎంత పొడిగా ఉంటే, అది ఉబ్బే అవకాశం అంత తక్కువగా ఉంటుంది. ґఇది అత్యంత సులభమైన ప్రభావవంతమైన ఇంటి చిట్కాలలో ఒకటి. సాధారణ కొవ్వొత్తిని లేదా పారాఫిన్ మైనాన్ని తలుపు లేదా కిటికీ అంచుల వెంబడి, ముఖ్యంగా రాపిడి కలిగే చోట మెల్లగా రుద్దండి. దీనివల్ల ఆ ఉపరితలం నునుపుగా మారి, తలుపు సులభంగా తెరుచుకోవడానికి ,మూసుకోవడానికి వీలవుతుంది. కొవ్వొత్తి లేదా మైనంతో రుద్దండిఇది అత్యంత సులభమైన ప్రభావవంతమైన ఇంటి చిట్కాలలో ఒకటి. సాధారణ కొవ్వొత్తిని లేదా పారాఫిన్ మైనాన్ని తలుపు లేదా కిటికీ అంచుల వెంబడి, ముఖ్యంగా రాపిడి కలిగే చోట మెల్లగా రుద్దండి. దీనివల్ల ఆ ఉపరితలం నునుపుగా మారి, తలుపు సులభంగా తెరుచుకోవడానికి ,మూసుకోవడానికి వీలవుతుంది. లేదా అంచుల వద్ద రాపిడి ఎక్కువగా ఉంటే, దూదిని ఉపయోగించి కొద్దిగా కొబ్బరి నూనె లేదా ఆవ నూనెను రాయవచ్చు. మరీ ఎక్కువగా నూనె రాయకుండా జాగ్రత్త వహించండి, ఎందుకంటే అది దుమ్ము, ధూళిని ఆకర్షిస్తుంది. అవసరమైన చోట మాత్రమే పలుచని పొరలా రాయండి .కొబ్బరి నూనె లేదా ఆవ నూనెను పలుచని పొరలా రాయండి.కీలు లేదా అంచుల వద్ద రాపిడి ఎక్కువగా ఉంటే, దూదిని ఉపయోగించి కొద్దిగా కొబ్బరి నూనె లేదా ఆవ నూనెను రాయవచ్చు. మరీ ఎక్కువగా నూనె రాయకుండా జాగ్రత్త వహించండి, ఎందుకంటే అది దుమ్ము, ధూళిని ఆకర్షిస్తుంది. అవసరమైన చోట మాత్రమే పలుచని పొరలా రాయండి. వర్షాకాలంలో ఇంట్లో తేమను తగ్గించడం కూడా ముఖ్యం. వీలైతే, డీహ్యూమిడిఫైయర్‌ను ఉపయోగించండి. ప్రత్యామ్నాయంగా, మీరు గదిలో సిలికా జెల్ ప్యాక్‌లు, బొగ్గు లేదా బేకింగ్ సోడా గిన్నెను ఉంచవచ్చు. ఇవి అదనపు తేమను పీల్చుకోవడానికి కలప అధికంగా ఉబ్బకుండా నిరోధించడానికి సహాయపడతాయి. ఇంట్లో తేమను తక్కువగా ఉంచండివర్షాకాలంలో ఇంట్లో తేమను తగ్గించడం కూడా ముఖ్యం. వీలైతే, డీహ్యూమిడిఫైయర్‌ను ఉపయోగించండి. ప్రత్యామ్నాయంగా, మీరు గదిలో సిలికా జెల్ ప్యాక్‌లు, బొగ్గు లేదా బేకింగ్ సోడా గిన్నెను ఉంచవచ్చు. ఇవి అదనపు తేమను పీల్చుకోవడానికి కలప అధికంగా ఉబ్బకుండా నిరోధించడానికి సహాయపడతాయి. ఆ భాగాన్ని తేలికగా సాండ్ (ఖఅ0) చేయండి.ఒకవేళ తడి ఆరిన తర్వాత కూడా చెక్క ఉబ్బిన స్థితిలోనే ఉండి తలుపు పదే పదే బిగుసుకుపోతుంటే, సన్నని గ్రిట్ కలిగిన సాండ్‌పేపర్‌తో ఆ భాగాన్ని తేలికగా రుద్దవచ్చు. ఆ తర్వాత, భవిష్యత్తులో తేమ నేరుగా చెక్కలోకి చేరకుండా నివారించడానికి, ఆ భాగంపై వుడ్ సీలెంట్, పాలిష్ లేదా పెయింట్‌ను పలుచని పొరలా పూయడం మర్చిపోవద్దు. వర్షాకాలంలో ఇంట్లో తగినంత గాలి ప్రసరణ ఉండేలా చూసుకోండి, సాధ్యమైనంతవరకు చెక్క నేరుగా వర్షపు నీటి తాకిడికి గురికాకుండా రక్షించండి. ఈ విషయాలను కూడా గుర్తుంచుకోండి:చెక్క తలుపులు మరియు కిటికీలకు అప్పుడప్పుడు వాటర్‌ప్రూఫ్ పాలిష్ లేదా సీలెంట్‌ను పూయండి.వర్షాకాలంలో ఇంట్లో తగినంత గాలి ప్రసరణ ఉండేలా చూసుకోండి, సాధ్యమైనంతవరకు చెక్క నేరుగా వర్షపు నీటి తాకిడికి గురికాకుండా రక్షించండి. ఒకవేళ తలుపు బాగా వంకరపోయినా లేదా చెక్కకు బూజు పట్టినా, తప్పనిసరిగా వడ్రంగితో దాన్ని పరిశీలించేలా చూసుకోండి. కొంచెం శ్రద్ధ వహించి, ఈ సరళమైన , ఆచరణాత్మక చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో కూడా మీ చెక్క తలుపులు, కిటికీలను సులభంగా వాడుకోవచ్చు. ఇది వాటి రూపాన్ని కాపాడటమే కాకుండా, వాటి మన్నికను కూడా పెంచుతుంది. ఒకవేళ తలుపు బాగా వంకరపోయినా లేదా చెక్కకు బూజు పట్టినా, తప్పనిసరిగా వడ్రంగితో దాన్ని పరిశీలించేలా చూసుకోండి.కొంచెం శ్రద్ధ వహించి, ఈ సరళమైన , ఆచరణాత్మక చిట్కాలను పాటించడం ద్వారా వర్షాకాలంలో కూడా మీ చెక్క తలుపులు, కిటికీలను సులభంగా వాడుకోవచ్చు. ఇది వాటి రూపాన్ని కాపాడటమే కాకుండా, వాటి మన్నికను కూడా పెంచుతుంది.





# నయా పల్సర్ వచ్చింది

**గరిష్ఠ ధర రూ.1.42 లక్షలు**

పూణె, : బజాజ్ ఆటో.. దేశీయ మార్కెట్‌కు నయా పల్సర్‌ను పరిచయం చేసింది. పల్సర్‌ను విడుదలై 25 ఏండ్లు పూర్తైన సందర్భంగా పల్సర్ ఎన్160 ఎస్, ఎన్160 ఎస్ఎస్ మాడళ్లను తీసుకొచ్చింది. వీటిలో ఎన్160 ఎస్ ధర రూ.1,33,511గా, ఎన్160 ఎస్ఎస్ ధరను రూ.1,42,585గా నిర్ణయించింది. ఈ ధరలు న్యూఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. కేవలం 4.5 సెకండ్లలో 60 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ బైకులో గూగుల్ మ్యాప్ మిర్రరింగ్‌తో కూడిన 5 టీఎఫ్‌టీ ఉన్నది. ఇలాంటి టెక్నాలజీ అందుబాటులో ఉన్న తొలి దేశీయ స్పోర్ట్స్ బైకు ఇదే కావడం విశేషం.

# ఫైనాన్స్ షేర్లు ఢమాల్



ముంబై, ఆగస్టు 7: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. రెండు రోజులుగా లాభాల్లో కదలాడిన సూచీలు.. తిరిగి అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకింగ్, ఇతర ఆర్థిక షేర్లలో పెట్టుబడులను మదుపర్లు ఉపసంహరించుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర మళ్లీ 80 డాలర్ల ఎగువకు చేరడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 455.59 పాయింట్లు లేదా 0.58 శాతం పతనమై 78,499.17 వద్ద ముగిసింది. నిఫ్టీ 65.35 పాయింట్లు లేదా 0.27 శాతం క్షీణించి 24,570.65 వద్ద నిలిచింది. ఇంట్రా-డేలోనైతే 113.25 పాయింట్లు కోల్పోయింది. బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 5.90 శాతం నష్టపోయింది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లూ మదుపర్లను ఆకట్టుకోలేక చతికిలపడ్డాయి. రంగాలవారీగా ఆర్థిక సేవలు, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, హౌసింగ్ ఫైనాన్స్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ సూచీలు 1.33 శాతం నుంచి 0.61 శాతం వరకు మదుపర్లకు నష్టాలను పంచాయి. అయితే బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సెలెక్ట్ ఇండెక్స్‌లు 0.20 శాతం, 0.19 శాతం పెరిగాయి. హొర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకల రవాణాకు సంబంధించి జరుగుతున్న సంప్రదింపుల్లో మళ్లీ ప్రతిష్ఠంభన నెలకొన్నది. ఈ క్రమంలోనే ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, జపాన్ సూచీలు నష్టపోయాయి. ఇక హౌతీల దాడులతో మిడిల్ ఈస్ట్ దద్దరిల్లుతున్న విషయం తెలిసిందే.

# ఐక్యతే మన బలం

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తిని స్మరించుకుంటూ, ఆ మహోద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు. శనివారం ఆయన 'ఎక్స్' వేదికగా ఈ మేరకు తన సందేశాన్ని పంచుకున్నారు. దేశ చరిత్ర గతిని మార్చి, భారతీయ ఆత్మను మేల్కొల్పిన మహోన్నత ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమమని ఆయన కొనియాడారు. "1942 ఆగస్టు 8న మహాత్మా గాంధీ ఇచ్చిన 'డూ ఆర్ డై' (సాధించు లేదా మరణించు) పిలుపు కోట్లాది మంది భారతీయుల్లో అచంచలమైన దేశభక్తిని, ధైర్యసాహసాలను నింపింది. ఈ నినాదం స్వాతంత్ర్య పోరాటాన్ని ఉవ్వెత్తున ఎగసిన జాతీయోద్యమంగా మార్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. మాతృభూమి విముక్తి కోసం ప్రాణత్యాగాలు చేసిన ఆ మహనీయులకు తాను శిరస్సు వంచి ప్రణమిల్లుతున్నట్లు తెలిపారు. భారతదేశ వాస్తవిక శక్తి ప్రజల ఐక్యతలో, సవాళ్లను అధిగమించాలనే సమష్టి సంకల్పంలోనే ఉందని ఈ ఉద్యమం మనకు గుర్తుచేస్తోందన్నారు. పటిష్టమైన, స్వయం సమృద్ధ, అభివృద్ధి చెందిన దేశాన్ని నిర్మించడం ద్వారానే ఆ వీరుల కలలకు, వారి త్యాగాలకు సరైన న్యాయం చేకూరుతుందని పవన్ కల్యాణ్ తన పోస్టులో వివరించారు.




# తగ్గిన పెట్రోల్ కార్ల అమ్మకాలు.. కారణం ఇదే!

భారతదేశంలో కార్లను కొనుగోలు చేస్తున్న వారిలో ఇంధన ఎంపికలు మారుతున్నాయి. ఫాడా విడుదల చేసిన జూలై 2026 రిటైల్ డేటా ప్రకారం.. పెట్రోల్/ఇథనాల్ కార్ల వాటా 41.68 శాతానికి తగ్గింది. జూన్‌లో ఇది 43.15 శాతంగా ఉండగా.. గతేడాది జూలైలో 47.62 శాతంగా ఉంది. మరోవైపు డీజిల్ కార్ల వాటా జూన్‌లో 16.32 శాతం నుంచి జూలైలో 17.73 శాతానికి పెరిగింది. గతేడాదితో పోలిస్తే డీజిల్ కార్ల వాటా కూడా స్వల్పంగా తగ్గినట్లు స్పష్టమవుతోంది. ఈ20 పెట్రోల్‌పై వినియోగదారుల్లో ఉన్న సందేహాలు కూడా ఈ మార్పుకు ఒక కారణమని ఫాడా చెబుతోంది. పెట్రోల్/ఇథనాల్‌పై ఆసక్తి తగ్గుతున్న తరుణంలో.. సీఎన్జీ, హైబ్రిడ్, ఎలక్ట్రిక్ వాహనాల వైపు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారు. జూలైలో సీఎన్జీ వాహనాల వాటా 24.67 శాతం, హైబ్రిడ్ కార్ల వాటా 8.02 శాతం, ఈవీల వాటా 7.90 శాతంగా ఉంది. ఈ మూడు కలిపితే 40.59 శాతం మార్కెట్ వాటా వస్తుంది. అంటే పెట్రోల్/ఇథనాల్ వాహనాల కంటే కేవలం 1.09 శాతం పాయింట్లు మాత్రమే తక్కువ. దీన్నిబట్టి చూస్తే వాహన కొనుగోలుదారులు పెట్రోల్



ప్రత్యామ్నాయాలను ఎంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు కూడా జూలైలో రికార్డు స్థాయికి చేరాయి. దేశవ్యాప్తంగా 3,27,901 ఈవీలు అమ్ముడైనట్లు నివేదిక వెల్లడించింది. ఇది మొత్తం ఆటో మార్కెట్‌లో 12.7 శాతం వాటా అన్నమాట. మొత్తం మీద డీజిల్ కార్ల వాటా పెరగడం కంటే.. పెట్రోల్/ఇథనాల్ నుంచి సీఎన్జీ, హైబ్రిడ్, ఈవీల వైపు వినియోగదారుల ఆసక్తి పెరగడమే ప్రధాన మార్పుగా కనిపిస్తోంది. రాబోయే పండుగల సీజన్‌లో ఈ ట్రెండ్ కొనసాగుతుందా లేదా అనేది తెలియాల్సి ఉంది.


# భారత్‌కు వార్ సెగ



న్యూఢిల్లీ: మిడిల్ ఈస్ట్‌లో అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం సెగ.. భారత్‌కు గట్టిగానే తగులుతున్నది. దేశీయ ఇంధన అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతుల ద్వారానే తీరుతున్నాయి. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో దేశంలోకి దిగుమతైన ముడి చమురు విలువ 49 బిలియన్ డాలర్లకు చేరింది. గత ఏడాది ఇదే వ్యవధిలో 39 బిలియన్ డాలర్లుగానే ఉన్నది. నిజానికి గతంతో పోల్చితే ఈసారి క్రూడాయిల్ దేశంలోకి తక్కువగానే వచ్చింది. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. నిరుడు ఏప్రిల్-జూన్‌లో 73 మిలియన్ టన్నులు రాగా, ఈ ఏప్రిల్-జూన్‌లో 59.7 మిలియన్ టన్నులే దిగుమతైంది. అయినప్పటికీ 10 బిలియన్ డాలర్లు అదనంగా చెల్లించాల్సి వచ్చింది. ఇందుకు కారణం గల్ఫ్ ఉద్రిక్తతలతో అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ముడి చమురు ధరలు, హొర్ముజ్ జలసంధిలో రవాణాకు అడ్డంకులేనంటున్నారు. పశ్చిమాసియా సంక్షోభం వల్లే 18 శాతం దిగుమతులు తగ్గినా.. 26 శాతం చెల్లింపులు పెరిగాయని పేర్కొంటున్నారు. మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలతో హొర్ముజ్ జలసంధిలో రవాణా చిక్కుల్లో పడింది. అమెరికాకు సౌదీ, కువైట్, యూఏఈ, ఖతార్ తదితర గల్ఫ్ దేశాలు అండగా ఉంటున్నాయన్న ఆగ్రహంతో ఇరాన్.. హొర్ముజ్ జలసంధిలో వెళ్తున్న వాణిజ్య నౌకలపై దాడులు చేస్తున్నది. దీంతో రవాణా సాగడం లేదు. ప్రపంచ ముడి చమురు సరఫరాల్లో హొర్ముజ్ మీదుగానే 20 శాతం జరుగుతున్నది. ఇక భారత్‌కు వచ్చే దిగుమతుల్లో దాదాపు 40 శాతం ఈ మార్గం గుండానే వస్తున్నది. కాగా, గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తుండటంతో అక్కడ ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి విఘాతం కలుగుతున్నది. దీంతో భారత్‌కు ముడి చమురు సరఫరాలో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతుండగా, డిమాండ్‌కు తగ్గ సైప్లె లేక ధరలూ పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి ఆఖర్లో మొదలైన గల్ఫ్ వార్.. ఇప్పటికీ జరుగుతున్నది. ఈ నేపథ్యంలోనే ఒకానొక దశలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 125 డాలర్లు పలుకడం గమనార్హం. హొర్ముజ్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పెరుగుతున్న రవాణా ఖర్చులూ భారత్ వంటి భారీ చమురు దిగుమతి దేశాలకు పెను సమస్యగా పరిణమిస్తున్నాయి. గల్ఫ్ వార్ నేపథ్యంలో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లపైనే భారత్ ఆధారపడుతున్నది. ఏప్రిల్-జూన్‌లో టన్నుకు సగటున 2,408 డాలర్లు చెల్లించి దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఇదే సమయంలో యూఏఈ నుంచి సగటున 2,213 డాలర్లకు ఒక్కో టన్నును భారత్ దిగుమతి చేసుకున్నది. కాగా, దేశీయ ముడి చమురు దిగుమతుల్లో రష్యా వాటా 40 శాతానికిపైగానే ఈ ఏప్రిల్-జూన్‌లో నమోదైంది. 14.6 శాతంతో యూఏఈ రెండో స్థానంలో ఉండగా, తర్వాత స్థానాల్లో సౌదీ అరేబియా (9.9 శాతం), వెనెజువెలా (5.2 శాతం), ఒమన్ (4.5 శాతం) ఉన్నాయి. ఇదిలావుంటే రష్యాపై అమెరికా విధిస్తున్న ఆంక్షల ప్రభావంతో భారతీయ ఎగుమతులపై అమెరికాలో అదనంగా 100 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉన్నదని జీటీఆర్ఐ అంచనా వేస్తున్నది. రష్యా నుంచి ముడి చమురు దిగుమతులు ఆపకపోతే టారిఫ్‌ల దెబ్బ ఖాయమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నది.


# చాలు బంగారం.. చాలు

మరావతి: పసిడి ప్రియులకు పేరొందిన భారత దేశంలో బంగారం కొనుగోళ్లు, దిగుమతులు తగ్గిపోతున్నాయి. 2021--22 సంవత్సరంతో పోలిస్తే 2025--26 ఆర్థిక సంవత్సరంలో దిగుమతులు 17.23 శాతం క్షీణించాయి. 2021--22లో 868.4 టన్నుల బంగారం దిగుమతి కాగా.. 2025--26లో 718.74 టన్నులకు పడిపోయిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపింది. అంతర్జాతీయంగా భారీగా పెరుగుతున్న బంగారం ధరలకు తోడు రూపాయి విలువ పడిపోవడం, బంగారం కొనుగోళ్లపై కేంద్రం ఆంక్షలు విధించడం దిగుమతులు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. బంగారం దిగుమతులను తగ్గించడానికి కేంద్రం ఈ ఏడాది మే నుంచి దిగుమతి సుంకాన్ని 6 శాతం నుంచి 15 శాతానికి పెంచింది. మరోపక్క బంగారం కొనుగోళ్లు తగ్గించాలని స్వయంగా ప్రధాని నరేంద్ర మోదీనే పిలుపునివ్వడంతో అమ్మకాలపై గణనీయమైన ప్రభావం కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు బంగారం దిగుమతులు ఆరేళ్ల కనిష్ట స్థాయికి 120 టన్నులకు పరిమితమైనట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రధాని పిలుపుతో ఆభరణాల అమ్మకాలు 24 శాతం తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. అలాగే పాత బంగారం అమ్మడం కూడా దిగుమతులు తగ్గడానికి ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు. ఇదే సమయంలో బంగారం ధరలు భారీగా పెరగడంతో స్మగ్లింగ్



పెరుగుతోంది. పరిమాణం పరంగా బంగారం దిగుమతులు తగ్గుతున్నా.. పసిడి దిగుమతుల బిల్లు మాత్రం భారీగా పెరిగిపోతోంది. 2021--22లో 868.4 టన్నుల దిగుమతికి ప్రస్తుత రూపాయి ధర ప్రకారం రూ.4,36,800 కోట్లు చెల్లించాల్సి వస్తే, 2025--26లో 718.74 టన్నులకు ఏకంగా రూ.6,88,320 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. అంటే దిగుమతులు తగ్గినా బిల్లు మాత్రం ఏకంగా 57.58 శాతం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం ఐదేళ్ల క్రితం ఔన్స్ బంగారం ధర 2,000 డాలర్లు ఉంటే ఇప్పుడది ఏకంగా 4,200 డాలర్లకు చేరడమే. ప్రస్తుతం దేశీయ మార్కెట్లో పది గ్రాముల బంగారం ధర రూ.1.40 లక్షల నుంచి రూ.1.50 లక్షల మధ్య కదులుతోంది. బంగారం ధరలు భారీగా పెరిగిపోవడంతో వినియోగదారులు తక్కువ బరువున్న ఆభరణాల కొనుగోలుకు మక్కువ చూపిస్తున్నట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.

నేటి ప్రస్థానం
తెలుగు దినపత్రిక




## రాకాలో అల్లు ద్విపాత్రాభినయనం

### రమ్యకృష్ణ కూడా కీ రోల్

అల్లు అర్జున్ నటిస్తున్న 'రాకా' చిత్రం ప్రస్తుతం సినీ రంగంలో సంచలనంగా మారింది. దర్శకుడు అట్లీ రూపొందిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదల కావడంతోనే భారీ చర్చ మొదలైంది. విడుదలైన ఫస్ట్ లుక్‌లో అల్లు అర్జున్ పూర్తిగా కొత్తగా కనిపించారు. ముందు గుండు, వెనుక కొద్దిగా జుట్టుతో, ముఖాన్ని చేతులతో కప్పకున్న తీరు భయానకంగా, రహస్యంగా ఉంది. సగం మనిషి, సగం తోడేలు స్వరూపంలో కనిపించనున్నట్టు ఈ చిత్రం సూచిస్తోంది.ఈ చిత్రంలో దీపిక పదుకొణెళె ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమె పాత్ర యోధురాలిగా ఉంటుందని సమాచారం. మరోవైపు రమ్యకృష్ణన్ కూడా కీలక పాత్రలో కనిపించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. అల్లు అర్జున్ ఫస్ట్ లుక్‌పై స్పందించిన రమ్యకృష్ణ.. 'పరిధులను దాటి వెళ్లే అనుభవానికి సిద్ధంగా ఉండండి' అని చెప్పడం ఆమె పాత్రపై మరింత ఆసక్తిని పెంచింది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఒకటి నాయక పాత్ర కాగా, మరొకటి ప్రతినాయక స్వభావం కలిగిన పాత్రగా ఉంటుందని సమాచారం. ప్రస్తుతం విడుదలైన రూపం ప్రతినాయక పాత్రదేనని చెబుతున్నారు. ఈ చిత్రంలో ఒకరి కంటే ఎక్కువ కథానాయికలు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. సమంత రూత్ ప్రభు, రష్మిక మంధాన పేర్లు వినిపిస్తున్నప్పటికీ దీనిపై ఇంకా అధికారిక ప్రకటన లేదు. ఇక 'రాకా' అనే పదానికి రాక్షసుడు, పౌర్ణమి చంద్రుడు వంటి అర్థాలున్నాయి. ఈ చిత్రంలో నాయకుడి లోపల ఉన్న చీకటి, విధ్వంసక శక్తిని చూపించేలా ఈ పేరును ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని అత్యంత భారీ వ్యయంతో నిర్మిస్తున్నారు. విజ్ఞానకథాంశం, అసాధారణ శక్తుల నేపథ్యంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు సమాచారం. వచ్చే ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని యోచిస్తున్నారు.



## ఆసుపత్రి పాలైన అవికా గోర్..

టెలివిజన్ ప్రేక్షకులను ఎంతగానో అలరించిన 'బాలికా వధు' (చిన్నారి పెళ్లికూతురు) ఫేమ్ అవికా గోర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. గత కొన్ని రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్న ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా తేలింది. ప్రస్తుతం ఆమె ముంబైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అవికా గోర్ భర్త మిలింద్ చంద్వానీ సోషల్ మీడియా వేదికగా ఆమె ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. గత ఐదు రోజులుగా ఆమె ఏకంగా 104 డిగ్రీల జ్వరంతో బాధపడుతున్నప్పటికీ, షూటింగ్‌కు ఎలాంటి అంతరాయం కలగకూడదనే ఉద్దేశంతో తన వృత్తిపై ఉన్న అంకితభావాన్ని చాటుకున్నారు. నిర్మాతలకు నష్టం జరగకూడదనే ఆలోచనతో ఆమె తీవ్ర అనారోగ్యంలోనూ షూటింగ్‌లలో పాల్గొనడమే కాకుండా, ఒక యాడ్ షూట్ కోసం ఢిల్లీకి కూడా ప్రయాణించారు. అయితే నీరసం మరియు జ్వరం మరింత పెరగడంతో ఆసుపత్రిలో చేరాల్సి వచ్చింది. ఆసక్తికరమైన విషయమేమిటంటే, ఆమె నటించిన సరికొత్త హిందీ మ్యూజిక్ ఆల్బమ్ 'బుఖార్' (జ్వరం) విడుదలైన రోజే ఆమె నిజంగానే జ్వరంతో ఆసుపత్రిపాలవడం గమనార్హం. ఆసుపత్రి మంచంపై నుంచే తన పాట విడుదలైన విషయాన్ని అభిమానులతో పంచుకున్న ఆమె, తన ప్లేట్‌లెట్ కౌంట్ తగ్గుతోందని, డెంగ్యూ ప్రభావం చాలా తీవ్రంగా ఉందని పేర్కొంటూ విక్టరీ సింబల్ చూపించారు. బాలనటిగా కెరీర్ ప్రారంభించి దేశవ్యాప్తంగా అపారమైన గుర్తింపు తెచ్చుకున్న అవికా గోర్ త్వరగా కోలుకోవాలని ఆమె అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

## టాలీవుడ్‌లో రితికా నాయక్ హవా..

టాలీవుడ్ యంగ్ అండ్ బ్యూటీఫుల్ హీరోయిన్ రితికా నాయక్ ప్రస్తుతం టాలీవుడ్ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి పాజిటివ్ టాక్‌తో థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది. ఈ చిత్రంలో చైత్ర అనే మోడరన్ పాత్రలో కనిపించిన రితికా నాయక్ తన అద్భుతమైన అభినయంతో పాటు అందచందాలతో కుర్రకారును ఎంతగానో ఫిదా చేస్తున్నారు. తెరపై ఆమె లుక్స్, పెర్ఫార్మెన్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.అయితే కెరీర్ ప్రారంభం నుండి వరుస విజయాలను సొంతం చేసుకుంటూ వస్తున్న ఈ అమ్మడు, టాలీవుడ్‌లో తిరుగులేని 'గోల్డెన్ హ్యాండ్' లేదా 'లక్కీ ఛార్మ్' అనే ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. అశోక వనములో అర్జున కల్యాణం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన రితికా నాయక్, ఆ తర్వాత వచ్చిన చిత్రాలతోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును ఏర్పరచుకున్నారు. ఏ పాత్రనైనా తన సహజమైన నటనతో రక్తికట్టించగల నటిగా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీకి, ఇప్పుడు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు క్యూ కడుతున్నాయి. సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తూ, కథాబలమున్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రితికా నాయక్ భవిష్యత్తులో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.





## నా జీవితాన్ని ఒక్కరి కోసం మార్చుకోలేను..

ఒకప్పుడు తెలుగు, హిందీ చిత్రాల్లో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న అమీషా పటేల్ మరోసారి తన వ్యక్తిగత జీవితంపై చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. 51 ఏళ్ల వయసులోనూ అవివాహితగా కొనసాగుతున్న ఆమె, పెళ్లి గురించి తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించారు. తాను ఎప్పటికీ పెళ్లి చేసుకోనని, ప్రస్తుతం సింగిల్ జీవితంతో ఎంతో సంతోషంగా ఉన్నానని చెప్పారు. తాజాగా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా అభిమానులతో నిర్వహించిన 'ఆస్క్ మీ ఎనీథింగ్' (ఇూహిూ) సెషన్‌లో ఓ అభిమాని.. మీరు ఎప్పుడు పెళ్లి చేసుకుంటారు? అని ప్రశ్నించాడు. దీనికి ఏమాత్రం సందేహించకుండా అమీషా తన అభిప్రాయాన్ని వెల్లడించారు. నేను ఎప్పటికీ పెళ్లి చేసుకోను. సింగిల్‌గా చాలా సంతోషంగా ఉన్నాను. నన్ను ప్రేమించే కుటుంబ సభ్యులు, స్నేహితులు నాకు చాలామంది ఉన్నారు. ఒక్క వ్యక్తి కోసం నా జీవితాన్ని, నా ఆనందాన్ని పూర్తిగా మార్చుకోవాలని నేను అనుకోవడం లేదు అని ఆమె సమాధానం ఇచ్చారు. అమీషా వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె అభిప్రాయానికి కొందరు నెటిజన్లు మద్దతు తెలుపుతూ.. ప్రతి ఒక్కరికీ తమ జీవితాన్ని తమకు నచ్చిన విధంగా గడిపే హక్కు ఉందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు మాత్రం పెళ్లి అనేది పరస్పర అవగాహన, ప్రేమ, సహజీవనానికి ప్రతీక అని అభిప్రాయపడుతున్నారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో అమీషా పటేల్ తన ప్రేమ జీవితం గురించి కూడా మాట్లాడారు. సినీ రంగంలోకి రావడం తన అప్పటి ప్రియుడికి ఇష్టం లేకపోవడంతో ఆ బంధం ముగిసిందని ఆమె వెల్లడించారు. ఆ అనుభవం తన జీవితంలో చాలా విషయాలు నేర్పిందని చెప్పారు. అలాగే, తన కెరీర్‌ను అర్థం చేసుకుని ప్రోత్సహించే వ్యక్తి దొరికితే పెళ్లి గురించి ఆలోచించేవారినని, కానీ అలాంటి మానసిక పరిణతి ఉన్న భాగస్వామిని కనుగొనడం సులభం కాదని పేర్కొన్నారు. వయసు కంటే వ్యక్తిత్వం, ఆలోచనా విధానమే ముఖ్యమని కూడా ఆమె అభిప్రాయపడ్డారు.అమీషా పటేల్ ఇటీవల సన్నీ డియోల్ సరసన నటించిన 'గదర్ 2' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్నారు. సకీనా పాత్రలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకోగా, ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించింది. అనంతరం 'తౌబా తేరా జల్వా' చిత్రంలో కనిపించిన అమీషా, ప్రస్తుతం తన తదుపరి ప్రాజెక్ట్‌లపై దృష్టి సారిస్తున్నారు.

## సెకండ్ ఇన్నింగ్స్ పై రాజశేఖర్ ఏమన్నారంటే...!

సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ తన కెరీర్‌లో సెకండ్ ఇన్నింగ్స్‌ను ఉత్సాహంగా ప్రారంభించారు. కథాబలం ఉంటే హీరో పాత్రలే కాదు, సహాయ నటుడిగా కనిపించడానికీ తాను సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఇటీవల విడుదలైన 'బైకర్' చిత్రంలో తన పాత్రకు ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణ పట్ల రాజశేఖర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై కథకు ప్రాధాన్యమున్న పాత్రలు వస్తే చేయడానికి వెనుకాడనని తెలిపారు. నటుడు ఎప్పుడూ నటుడే. మంచి పాత్ర దొరికితే తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధంగా ఉంటాడు అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 60 ఏళ్లు దాటినా ఇప్పటికీ యంగ్‌గా, ఎనర్జిటిక్‌గా కనిపించడం వెనుక ఉన్న రహస్యాన్ని కూడా రాజశేఖర్ పంచుకున్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలే తన ఫిట్‌నెస్‌కు కారణమని చెప్పారు. ముఖ్యంగా పుచ్చకాయ, ఆపిల్, ఆరెంజ్ పండ్ల రసాల మిశ్రమాన్ని ప్రతిరోజూ తీసుకుంటానని, దీనితో పాటు క్రమం తప్పని వ్యాయామం తనలో శక్తిని నింపుతుందని వివరించారు. ఈ సెకండ్ ఇన్నింగ్స్‌లో తన భార్య జీవిత పాత్ర ఎంతో కీలకమని రాజశేఖర్ తెలిపారు.

EDITED , PRINTED, PUBLISHED & OWNED BY PRINTED AND PUBLISHED BY MAHESH ETABONIA ON BEHALF OF NETI PRASTAVANAM MEDIA NETWORK , HNO-14-249/1/37 SAI NAGAR COLONY,MEDCHAL(V) MEDCHAL MALIKAJGIRI, -501401 at 14-249/1/37 Sai Nagar Colony, MEDCHAI, TELANGANA STATE , EDITOR : MAHESH ETABONIA :9908086026 Website : https://netiprasthanam.in/